# మన విశ్వం

manavishwam.com

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 103 | మంగళవారం 29 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్


## స్థానిక కోటాకు.. నాలుగేళ్లు తప్పనిసరి!

వైద్య, దంత వైద్య ప్రవేశాల్లో తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు స్పష్టత



వివరాలు 2లో..

# సిరిసిల్లలో.. రేవంత్ ఏం పేల్చబోతున్నారు?



**కేటీఆర్ కంచుకోటలో రేపు సీఎం సభ.. తెలంగాణ రాజకీయాల్లో పెరిగిన ఉత్కంఠ**

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి చూపు సిరిసిల్లపైనే. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రేపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న భారీ బహిరంగ సభపై రాజకీయ ఉత్కంఠ నెలకొంది. నకిరేకల్ సభలోనే సిరిసిల్లకు వస్తానని ప్రకటించిన సీఎం.. ఇప్పుడు నేరుగా కేటీఆర్ నియోజకవర్గంలో అడుగుపెడుతుండటంతో ఆయన ప్రసంగం ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. సిరిసిల్ల సభను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. భారీ జనసమీకరణతో

మిగతా 2లో..

- నకిరేకల్‌లో చెప్పినట్టే సిరిసిల్లకు రేవంత్.. సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్
- 8 వేల ఎకరాల ఆరోపణలపై లెక్కలతో రావాలంటూ సీఎంకు కేటీఆర్ బహిరంగ సవాల్
- 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకుంటే గ్రామం, సర్వే నంబర్లతో శ్వేతపత్రం ఇవ్వాలని డిమాండ్
- నేతన్నల నుంచి భూముల వరకు.. సీఎం సమాధానమిస్తారా? కొత్త ఆరోపణలు సంధిస్తారా?



# ఉద్యోగానికి వెళ్తూ.. నలుగురు బలి!

**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** పొట్టకూటి కోసం రోజూలాగే ఉద్యోగానికి బయల్దేరిన మహిళలను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో సోమవారం జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టడంతో అత్తిలి సౌందర్య, చింతకుంట లక్ష్మి ఘటనాస్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోనియా, సుమలత కూడా కన్నుమూశారు. దీంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. మరో ముగ్గురు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నట్లు తాజా సమాచారం. మృతులు మందమర్రి మండలం గుడిపెల్లి, పొన్నారం తదితర గ్రామాలకు చెందిన వారిగా గుర్తించారు. వీరు మంచిర్యాల పట్టణంలోని

మిగతా 2లో..

- నస్పూర్‌లో లారీ-ఆటో ఢీ.. ఘోర రోడ్డు ప్రమాదం
- ఇద్దరు మహిళలు అక్కడికక్కడే.. మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి
- మంచిర్యాలలోని షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న బాధితులు
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స
- ప్రమాద కారణంపై పోలీసుల దర్యాప్తు
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

## యూపీఐపై రుసుము.. 'స్టే'కు సుప్రీం నో!



- రూ.2 వేలు దాటిన వ్యాపార చెల్లింపులపై 0.4 శాతం రుసుము
- కొత్త విధానాన్ని నిలిపివేయాలన్న అభ్యర్థనకు నిరాకరణ
- కేంద్రం, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐలకు నోటీసులు
- నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- వ్యక్తుల మధ్య నగదు బదిలీలకు రుసుము లేదు
- అక్టోబర్ 15 నుంచి కొత్త విధానం అమలుకు సన్నాహాలు

వివరాలు 2లో..

# జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాల్సిందే!

- హైదరాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన
- నెక్లెస్ రోడ్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీ
- 10 నెలల్లో 14 అభ్యంతరాలు.. సమాధానం చెప్పాలని డిమాండ్
- ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలతో మరింత ముదిరిన వివాదం
- కీలక నిర్ణయాలు ఏకగ్రీవమేనంటున్న ఎన్నికల సంఘం



వివరాలు 2లో..

## ఓటు హక్కును కాపాడాల్సిందే!



- జనాభా పెరుగుతుంటే.. ఓటర్ల సంఖ్య ఎలా తగ్గుతుంది?
- జాబితా సవరణలో అర్హుల హక్కులకు భంగం కలగొద్దు
- ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్న సీఎం రేవంత్‌రెడ్డి
- జనాభా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేయొద్దు
- లోక్‌సభలో ప్రాతినిధ్యం తగ్గితే గొంతు బలహీనపడుతుందని ఆందోళన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** దేశంలో జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్య తగ్గడం ఎలా సాధ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన వారి ఓటు హక్కుకు భంగం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎవరు పరిపాలించాలో నిర్ణయించే అధికారం ప్రజలదేనని, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో 'ప్రతిదిన్ మీడియా

మిగతా 2లో..

# పొంగులేటి కేసు.. రెండేళ్లుగా ఏమైంది?



- 2024 సెప్టెంబర్‌లో 16 ప్రాంతాల్లో ఈడీ సోదాలు
- దర్యాప్తు ఏ దశలో ఉందో వెల్లడించాలంటూ బీఆర్ఎస్ డిమాండ్
- ఈడీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు.. పలువురు నేతల తాత్కాలిక నిర్బంధం
- సోదాల్లో ఏం దొరికింది?.. ఏం స్వాధీనం చేసుకున్నారు?.. కేసు స్థితి ఏంటి?
- 15 రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని వినతిపత్రం

వివరాలు 2లో..

# సచివాలయమే.. నిరసనల అడ్డాగా మారిందా?

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన రాష్ట్ర సచివాలయం.. కాంగ్రెస్ పాలనలో నిరసనలకు అడ్డాగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు, పదవీ విరమణ ప్రయోజనాల కోసం రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు సచివాలయంలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం ఇంకెంతకాలం తప్పించుకుంటుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో



- రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల ఆందోళనపై హరీశ్‌రావు ధ్వజం
- ఏళ్లుగా బిల్లులు పెండింగ్‌లో పెట్టడం దారుణమని విమర్శ
- పెద్ద కాంట్రాక్టర్లకు చెల్లింపులు.. చిన్నవారి బిల్లులు ఎందుకు ఆపారు?
- 20-30 శాతం కమీషన్ ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్
- 2024 మార్చి నుంచి రిటైరైన ఉద్యోగుల ప్రయోజనాలపై నిలదీత
- ఇదేనా కాంగ్రెస్ చెప్పిన 'ప్రజాపాలన' అంటూ ప్రశ్న

పెడుతున్నారని నిలదీశారు. పెండింగ్ బిల్లుల మంజూరు కోసం 20 నుంచి 30 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగిన విషయాన్ని ప్రస్తావించిన హరీశ్‌రావు.. కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే వారి బిల్లులు ఆపుతున్నారా అని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేస్తామని మే నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ ఏమైందని

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# ఖాళీ అవుతున్న పల్లెలు

దేశానికి పల్లెలే పట్టుగొమ్మలని గొప్పగా చెప్పుకుంటాం. కానీ ఆ పట్టుగొమ్మలే ఇప్పుడు బలహీనపడుతున్నాయి. ఒకప్పుడు పిల్లల కేరింతలు, యువత సందడి, పొలం పనులతో కళకళలాడిన గ్రామాల్లో ఇప్పుడు మూసిన ఇళ్లు.. ఖాళీ వీధులు.. వృద్ధులే ఎక్కువగా కనిపించే పరిస్థితి పెరుగుతోంది. చదువు, ఉద్యోగం, ఉపాధి కోసం యువత పట్టణాలకు తరలిపోతోంది. ఇది కేవలం వలస కాదు.. గ్రామీణ వ్యవస్థలో వస్తున్న ప్రమాదకరమైన మార్పు. యువతకు పల్లె మీద ప్రేమ లేక నగరాలకు వెళ్లడం లేదు. గ్రామంలోనే బతికేందుకు అవసరమైన అవకాశాలు లేక వెళ్తోంది. ఒకప్పుడు కుటుంబానికి భరోసాగా ఉన్న వ్యవసాయం ఇప్పుడు అనిశ్చితితో నిండిపోయింది. సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. పంటకు గిట్టుబాటు ధరపై భరోసా లేదు. ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతున్నాయి. ఏడాది పొడవునా కష్టపడినా చివరకు చేతిలో ఎంత మిగులుతుందో తెలియని పరిస్థితిలో యువత వ్యవసాయాన్ని భవిష్యత్తుగా ఎంచుకోవడానికి వెనుకడుగు వేస్తోంది. చదువు కోసం ఊరు విడిచిన యువత కూడా తిరిగి పల్లెకు రావడం లేదు. కారణం స్పష్టమే. చదువుకు తగిన ఉద్యోగం గ్రామంలో ఎక్కడ? ఉపాధి అవకాశాలన్నీ పట్టణాల్లోనే కేంద్రీకృతమైతే యువతను పల్లెల్లో ఉండమని ఎలా చెప్పగలం? ఫలితంగా గ్రామాలకు అవసరమైన విద్యావంతులు, నైపుణ్యం కలిగిన యువశక్తి దూరమవుతోంది. దీని ప్రభావం ఇప్పటికే పొలాల్లో కనిపిస్తోంది. పనిచేసే చేతులు తగ్గుతున్నాయి. వృద్ధులు, మహిళలపై వ్యవసాయ భారం పెరుగుతోంది. కొన్ని చోట్ల సాగు చేయలేక భూములను వదిలేసే పరిస్థితులూ కనిపిస్తున్నాయి. ఇదే ధోరణి కొనసాగితే దెబ్బతినేది రైతు కుటుంబం మాత్రమే కాదు.. మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. పల్లెలు ఖాళీ కావడంలో మరో ఆందోళనకరమైన కోణమూ ఉంది. ఊరంతా కలిసి జరుపుకొనే పండుగలు, ఆపదలో ఆదుకునే మనుషులు, తరతరాలుగా సంక్రమించే కళలు, వృత్తులు, సంప్రదాయాలు.. ఇవన్నీ గ్రామంతో ముడిపడినవే. యువత లేని పల్లె అంటే కొన్ని ఇళ్లు ఖాళీ కావడం మాత్రమే కాదు.. ఒక తరం నుంచి మరో తరానికి చేరాల్సిన సామాజిక వారసత్వం తెగిపోవడం కూడా. అలాగని నగరానికి వెళ్లిన ప్రతి ఒక్కరి జీవితం బంగారమవుతోందా? అదీ లేదు. ఉద్యోగం దొరికినా అధిక అద్దెలు, జీవన వ్యయం, రద్దీ, కాలుష్యం వెంటాడుతున్నాయి. చాలామందికి ఉపాధి దొరుకుతోంది కానీ జీవన భద్రత దొరకడం లేదు. పల్లెలో అవకాశం లేక.. పట్టణంలో ప్రశాంతత లేక.. ఈ రెండింటి మధ్య నలిగిపోతున్నది సామాన్య కుటుంబమే. అందుకే వలస వెళ్లేవారిని తప్పుబట్టడం కాదు.. వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయడం పరిష్కారం. గ్రామంలోనే గౌరవప్రదమైన ఆదాయం లభించాలి. వ్యవసాయం లాభసాటిగా మారాలి. పంటల ఆధారిత పరిశ్రమలు, ఆహార శుద్ధి కేంద్రాలు, చిన్న పరిశ్రమలు గ్రామాలకు చేరాలి. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు స్వయం ఉపాధికి అవసరమైన ఆర్థిక, మార్కెట్ సహకారం అందాలి. చదువు, వైద్యం, ఉపాధి కోసం ప్రతి అవసరానికీ పట్టణానికే పరుగెత్తాల్సిన పరిస్థితి మారాలి. గ్రామాభివృద్ధి అంటే రోడ్లు, వీధిదీపాలు, భవనాలతో ముగిసిపోయేది కాదు. ఒక యువకుడు తన భవిష్యత్తును సొంత ఊరిలోనే ఊహించుకోగలగాలి. చదువుకున్న యువతి అక్కడే గౌరవప్రదమైన ఉపాధి పొందగలగాలి. రైతు తన బిడ్డను వ్యవసాయంలోకి తీసుకురావడానికి భయపడని పరిస్థితి ఉండాలి. అదే నిజమైన గ్రామాభివృద్ధి. పల్లెలను కాపాడాలంటే మనుషులను అక్కడే ఉండమని చెప్పడం కాదు.. ఉండాలనిపించే పరిస్థితులను సృష్టించాలి. అవకాశాలన్నీ నగరాల్లో కేంద్రీకరించి, పల్లెలు ఎందుకు ఖాళీ అవుతున్నాయని ప్రశ్నించడం అర్థరహితం. అభివృద్ధి గ్రామం గడప వరకు కాదు.. ప్రతి కుటుంబం జీవనోపాధి వరకు చేరాలి. పల్లె ఖాళీ అయితే ఖాళీ అయ్యేది కొన్ని ఇళ్లు మాత్రమే కాదు. పొలం బలహీనపడుతుంది.. వ్యవసాయం దెబ్బతింటుంది.. సంస్కృతి కనుమరుగవుతుంది.. పట్టణాలపై జనాభా ఒత్తిడి పెరుగుతుంది. అందుకే ఖాళీ అవుతున్న పల్లెలు ఇప్పుడు మన ముందున్న హెచ్చరిక. పల్లెలు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. వ్యవసాయం బతికితేనే ఆహార భద్రత నిలుస్తుంది. యువతకు పల్లెల్లోనే భవిష్యత్తు కనిపించేలా చేయగలిగితేనే గ్రామీణ భారతం నిలబడుతుంది. ఖాళీ అవుతున్న పల్లెలను చూస్తూ ఉండిపోవడం కాదు.. మళ్లీ కళకళలాడేలా చేయడమే అసలైన అభివృద్ధి.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# స్థానిక కోటాకు.. నాలుగేళ్లు తప్పనిసరి!

**వైద్య, దంత వైద్య ప్రవేశాల్లో తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు స్పష్టత**

**అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల చదువే కీలక ప్రమాణం**

**నిబంధనను సవాల్ చేసిన విద్యార్థిని పిటిషన్‌కు దక్కని ఊరట**

**రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా ఉన్న స్థానికత నిబంధనలకు న్యాయస్థానం మద్దతు**

**తెలంగాణలో గతంలో చదివితేనే సరిపోదు.. నిర్దేశిత అర్హతలు పాటించాల్సిందే**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** తెలంగాణలో వైద్య, దంత వైద్య విద్య ప్రవేశాల్లో స్థానిక కోటా పొందాలంటే అర్హత పరీక్షతో ముగిసే వరుస నాలుగు విద్యా సంవత్సరాల చదువు కీలకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. స్థానిక అభ్యర్థిత్వానికి అమలవుతున్న ఈ నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌కు ఊరట లభించలేదు. రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా రూపొందించిన స్థానికత నిబంధనలను పాటించాల్సిందేనని తేల్చింది. జెల్లా అంకిత అనే విద్యార్థిని తెలంగాణలో చిన్నతనం నుంచి పదో తరగతి వరకు చదివి, ఇంటర్మీడియట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో పూర్తి చేశారు. వైద్య విద్య ప్రవేశాల్లో తనను తెలంగాణ స్థానిక అభ్యర్థిగా పరిగణించాలని ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత ఏడు సంవత్సరాల కాలంలో ఎక్కువ భాగం తెలంగాణలోనే చదివినందున స్థానిక హోదా ఇవ్వాలన్నది ఆమె వాదన. అయితే స్థానికత నిర్ణయానికి అమల్లో ఉన్న నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధనే కీలకమని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**నాలుగేళ్లే కీలకం**

వైద్య విద్యలో స్థానిక కోటాకు అర్హత నిర్ణయించేటప్పుడు అర్హత పరీక్షతో ముగిసే నాలుగు వరుస విద్యా సంవత్సరాల చదువును పరిగణనలోకి తీసుకుంటారు. విద్యాసంస్థల్లో చదవని అభ్యర్థులకు నిర్దేశిత నివాస ప్రమాణాలు వర్తిస్తాయి. అలాగే తల్లిదండ్రుల ప్రభుత్వ ఉద్యోగ బదిలీలు, అఖిల భారత సర్వీసులు, రక్షణ రంగం తదితర నిర్దేశిత వర్గాలకు నిబంధనల ప్రకారం మినహాయింపులు ఉంటాయి.

**గత తీర్పుతోనే స్పష్టత**

తెలంగాణ వైద్య, దంత వైద్య కళాశాలల్లో స్థానిక అభ్యర్థుల అర్హతకు సంబంధించిన నాలుగేళ్ల ప్రమాణాన్ని సుప్రీంకోర్టు గతంలోనే సమర్థించింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా రాష్ట్రం రూపొందించిన స్థానికత నిబంధనలకు న్యాయబద్ధత ఉందని స్పష్టం చేసింది. తాజాగా మరోసారి ఇదే అంశం న్యాయస్థానం ముందుకు రావడంతో గత తీర్పులోని సూత్రాలే కీలకమయ్యాయి. దీంతో వైద్య విద్య ప్రవేశాల్లో స్థానిక కోటాపై నెలకొన్న సందిగ్ధతకు మరింత స్పష్టత వచ్చినట్లయింది. తెలంగాణలో పుట్టడం లేదా గతంలో ఎక్కువకాలం చదవడం ఒక్కటే స్థానిక కోటాకు అర్హతగా మారదు. అమల్లో ఉన్న విద్యాభ్యాసం లేదా వర్తించే ప్రత్యామ్నాయ అర్హతలను పూర్తి చేయాల్సి ఉంటుంది. వైద్య, దంత వైద్య ప్రవేశాల్లో నాలుగేళ్ల స్థానికత ప్రమాణమే కీలకమని తాజా పరిణామంతో మరోసారి స్పష్టమైంది.

# ఉద్యోగానికి వెళ్తూ.. నలుగురు బలి!

మొదటిపేజీ తరువాయి

ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తున్నట్లు సమాచారం. సోమవారం ఉదయం విధులకు వెళ్లేందుకు ఆటోలో బయల్దేరగా నస్పూర్ వద్ద ప్రమాదం జరిగింది. ఢీకొన్న తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయింది. ప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని పోలీసుల దర్యాప్తులో తేల్చాల్సి ఉంది. ఘటనాస్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు డివైడర్లు, రహదారి సూచికలు తదితర భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నస్పూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉదయం కుటుంబ సభ్యులకు చెప్పి విధులకు బయల్దేరిన మహిళలు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే ప్రమాదంలో నలుగురు మహిళల ప్రాణాలు పోవడం మంచిర్యాల జిల్లాను దిగ్భ్రాంతికి గురిచేసింది.

# సిరిసిల్లలో.. రేవంత్ ఏం పేల్చబోతున్నారు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా సిరిసిల్ల అభివృద్ధి, నేతన్నల సంక్షేమం, సాగునీరు, భూముల వ్యవహారంపై సీఎం ఏం చెబుతారన్న చర్చ సాగుతోంది. ఇదే సమయంలో సీఎం పర్యటనకు ముందే కేటీఆర్ బహిరంగ లేఖతో రాజకీయ వేడిని మరింత పెంచారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని చేస్తున్న ఆరోపణలకు ఆధారాలతో రావాలని సీఎంను డిమాండ్ చేశారు. అందులో 2,400 ఎకరాలను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని చెబుతున్న నేపథ్యంలో.. ఏ మండలంలో, ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉందో ప్రజల ముందు పెట్టాలని కోరారు. పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. భూముల అంశంతోనే కేటీఆర్ ఆగలేదు. సిరిసిల్ల నేతన్నల పెండింగ్ బకాయిలు, నూలు రాయితీ, నేతన్న బీమా, వీవింగ్ పార్క్, కొత్త పరిశ్రమలు, రైతు భరోసా, రుణమాఫీ, సాగునీరు సహా పలు అంశాలపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో రేపటి సభపై రాజకీయ ఆసక్తి మరింత పెరిగింది. కేటీఆర్ సంధించిన ప్రశ్నలకు రేవంత్ సభా వేదిక నుంచే సమాధానం చెబుతారా? 8 వేల ఎకరాల వ్యవహారంలో ప్రభుత్వం వద్ద ఉన్న వివరాలను బయటపెడతారా? లేక కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని మరిన్ని ఆరోపణలు చేస్తారా? సిరిసిల్లకు కొత్త వరాలు ప్రకటిస్తారా? అన్నది చర్చనీయాంశమైంది. ఒకవైపు "లెక్కలతో రండి" అంటూ కేటీఆర్ సవాల్.. మరోవైపు ఆయన సొంత నియోజకవర్గంలో రేవంత్ భారీ సభ. దీంతో సిరిసిల్ల సభ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. రేపు సీఎం ప్రసంగంలో ఏ అంశాలు ప్రస్తావనకు వస్తాయన్నదే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాల్సిందే!

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మన విశ్వం): ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్‌తో తెలంగాణ కాంగ్రెస్ హైదరాబాద్‌లో భారీ నిరసన చేపట్టింది. ఏఐసీసీ పిలుపులో భాగంగా నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు నిరసనలో పాల్గొన్నారు. ఎన్నికల సంఘంలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కాంగ్రెస్ ప్రధానంగా ప్రస్తావించింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో నిర్ణయాలు, ఆదేశాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం



చేసిన అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు-పునరుద్ధరణ, ఓటర్ల జాబితాలు, సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై ఈ అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడైంది. ఈ అభ్యంతరాలపై పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతూ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని నేతలు కోరారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.

అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. కమిషన్‌లో సూచనలు, భిన్నాభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో భాగమేనని, ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన కీలక నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. దీంతో ఇద్దరు కమిషనర్ల అభ్యంతరాలు, ఎన్నికల సంఘం వివరణ చుట్టూ వివాదం మరింత వేడెక్కింది.

# యూపీఐపై రుసుము.. 'స్టే'కు సుప్రీం నో!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (మన విశ్వం) :** యూపీఐ ద్వారా చేసే వ్యాపార చెల్లింపులపై రుసుము విధించే అంశం సుప్రీంకోర్టుకు చేరింది. రూ.2 వేలకుపైగా చేసే నిర్దిష్ట వ్యాపార యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే కొత్త విధానాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ), భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ)లకు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. నాలుగు వారాల్లో సమాధానాలు సమర్పించాలని ఆదేశించింది. అయితే అప్పటివరకు కొత్త విధానం అమలును నిలిపివేయాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. కొత్త విధానం ప్రకారం వ్యక్తులు వ్యాపారులకు యూపీఐ ద్వారా చేసే రూ.2 వేలకుపైబడిన నిర్దిష్ట చెల్లింపులపై 0.4 శాతం రుసుము వర్తించనుంది. రూ.75 వేలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన అర్హతగల లావాదేవీలపై గరిష్ఠ రుసుమును రూ.300కు పరిమితం చేశారు. అయితే అన్ని రకాల యూపీఐ లావాదేవీలకూ ఈ రుసుము వర్తించదు. కొన్ని రంగాలకు ప్రత్యేక రేట్లు, నిబంధనలు ఉన్నాయి. సాధారణ యూపీఐ వినియోగదారులు ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొత్త రుసుము ప్రధానంగా అర్హతగల వ్యాపార చెల్లింపులకు సంబంధించినదే. 0.4 శాతం రుసుము వర్తించే వ్యాపార లావాదేవీ రూ.5 వేలు ఉంటే రుసుము రూ.20 అవుతుంది. రూ.10 వేల చెల్లింపుపై రూ.40 అవుతుంది. అయితే ఈ మొత్తాన్ని వినియోగదారుడే తప్పనిసరిగా అదనంగా చెల్లించాల్సి ఉంటుందని భావించకూడదు. ఎండీఆర్ అనేది ప్రధానంగా వ్యాపార చెల్లింపుల వ్యవస్థలో వసూలయ్యే రుసుము. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇప్పటివరకు తుది నిర్ణయం వెల్లడించలేదు. కొత్త రుసుము విధానం అమలును తాత్కాలికంగా నిలిపివేయాలన్న అభ్యర్థనను మాత్రమే ప్రస్తుత దశలో అంగీకరించలేదు. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐ సమర్పించే సమాధానాలను పరిశీలించిన అనంతరం కేసుపై తదుపరి విచారణ జరగనుంది. అందువల్ల యూపీఐ వ్యాపార చెల్లింపులపై రుసుముకు సంబంధించి సుప్రీంకోర్టు చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# సచివాలయమే.. నిరసనల అడ్డాగా మారిందా?

(మొదటిపేజీ తరువాయి)

నిలదీశారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రయోజనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా ప్రభుత్వానికి సేవలందించిన ఉద్యోగులు తమకు రావాల్సిన సొమ్ము కోసం సచివాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. ప్రజల సమస్యలు వినాల్సిన ప్రభుత్వమే.. తమ గోడు చెప్పుకోవడానికి వచ్చిన వారిని పోలీసులతో అడ్డుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. సమస్యలు వినడానికే సిద్ధంగా లేని ప్రభుత్వం వాటికి పరిష్కారం ఎలా చూపుతుందని నిలదీశారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, వందలాది హామీలతో ప్రజల ముందుకొచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారికే అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. "ఇదేనా కాంగ్రెస్ చెప్పిన ప్రజాపాలన?" అంటూ ప్రశ్నించిన హరీశ్‌రావు.. రిటైర్డ్ ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.





# ఓటు హక్కును కాపాడాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

నెట్‌వర్క్' నిర్వహించిన 'ది కాన్‌క్లేవ్-2026'లో 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, అర్హతల నిర్ధారణ వంటి ప్రక్రియలు పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

దక్షిణాదికి నష్టం చేయొద్దు

నియోజకవర్గాల పునర్విభజనపైనా రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలగకూడదన్నారు. లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గితే జాతీయ విధానాల రూపకల్పనలో ఆయా రాష్ట్రాల వాదన బలహీనపడే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

కేంద్రం సహకారం అవసరం

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం అవసరమని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారుల వంటి కీలక ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని వనరులు, మానవ వనరులను సమర్థంగా వినియోగించుకునేందుకు అవకాశాలు కల్పించాలని కోరారు.

విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమం, నర్సరీ విద్య, విద్యార్థుల్లో భాషా, సంభాషణ నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

# పొంగులేటి కేసు.. రెండేళ్లుగా ఏమైంది?

- **2024 సెప్టెంబర్‌లో 16 ప్రాంతాల్లో ఈడీ సోదాలు**
- **దర్యాప్తు ఏ దశలో ఉందో వెల్లడించాలంటూ బీఆర్ఎస్ డిమాండ్**
- **ఈడీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆందోళన**
- **అడ్డుకున్న పోలీసులు.. పలువురు నేతల తాత్కాలిక నిర్బంధం**
- **సోదాల్లో ఏం దొరికింది?.. ఏం స్వాధీనం చేసుకున్నారు?.. కేసు స్థితి ఏంటి?**
- **15 రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని వినతిపత్రం**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (మన విశ్వం): రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిర్వహించిన సోదాల వ్యవహారం మరోసారి రాజకీయంగా తెరపైకి వచ్చింది. 2024 సెప్టెంబర్ 27, 28 తేదీల్లో సుమారు 16 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన తర్వాత దర్యాప్తు ఏ దశకు చేరింది? ఏమైనా నగదు, పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారా? నోటీసులు లేదా సమన్లు ఇచ్చారా? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సోదాలు జరిగి రెండేళ్లు గడుస్తున్నా దర్యాప్తు స్థితిపై స్పష్టత లేదని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. సోదాల్లో ఏం స్వాధీనం చేసుకున్నారు, దర్యాప్తులో ఏం తేలింది, తదుపరి చర్యలు ఏమైనా చేపట్టారా అనే వివరాలను వెల్లడించాలని ఈడీ అధికారులకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. దర్యాప్తు కొనసాగుతుంటే ప్రస్తుత స్థితిని, ముగిసిపోయి ఉంటే ఆ విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఈడీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించగా పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పలువురు నేతలను పోలీసులు తాత్కాలికంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్‌రెడ్డి తదితరులతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఈడీ అధికారులను కలిసేందుకు అనుమతించారు.

15 రోజుల్లో చెప్పండి!

ఈడీ అధికారులకు వినతిపత్రం అందించిన బీఆర్ఎస్ ప్రతినిధులు 15 రోజుల్లో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని కోరారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతుంటే తదుపరి చర్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణపేట--కొడంగల్ ఎత్తిపోతల పథకం, వట్టినాగులపల్లి, కొత్వాల్‌గూడకు సంబంధించి తాము గతంలో చేసిన ఫిర్యాదుల స్థితిపైనా వివరాలు కోరారు.

కేటీఆర్ ఏమన్నారంటే

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కూడా ఈడీ దర్యాప్తు స్థితిపై ప్రశ్నలు లేవనెత్తారు. ప్రతిపక్ష నేతల విషయంలో వేగంగా స్పందించే కేంద్ర దర్యాప్తు సంస్థలు కాంగ్రెస్ మంత్రికి సంబంధించిన వ్యవహారంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య అవగాహన ఉందని ఆరోపించారు.

సోదాలు జరిగాయి.. తర్వాతేంటి?

రెండేళ్ల క్రితం 16 ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. ఇప్పుడు అదే దర్యాప్తు స్థితిని వెల్లడించాలంటూ ప్రధాన ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు నేరుగా ఈడీ కార్యాలయం వద్దకు చేరడం ఈ వ్యవహారాన్ని మళ్లీ రాజకీయ చర్చలోకి తెచ్చింది. సోదాలు జరిగినంత మాత్రాన ఆరోపణలు నిర్ధారణ అయినట్లు కాదు. అయితే దర్యాప్తు కొనసాగుతోందా? ముగిసిందా? తదుపరి చర్యలేమిటి? అన్న ప్రశ్నలకు ఈడీ నుంచి స్పష్టత రావాలని బీఆర్ఎస్ కోరుతోంది. రెండేళ్ల క్రితం సోదాలు.. ఇప్పుడు ఈడీ కార్యాలయం వద్ద ఆందోళన. దీంతో తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే---పొంగులేటి కేసు.. రెండేళ్లుగా ఏమైంది?

# క్యాన్సర్ రేడియేషన్ చికిత్సలో 'ఎం ఆర్ లైనాక్ ' సాంకేతికత

**మంచిర్యాల,సెప్టెంబర్ 28(మన విశ్వం ):**
క్యాన్సర్ రోగులకు మరింత కచ్చితమైన, ఆధునిక రేడియేషన్ చికిత్స అందించడంలో ఎం ఆర్ లైనాక్ సాంకేతికత కీలకంగా మారుతోందని యశోద హాస్పిటల్స్ -- హైటెక్ సిటీ వైద్యులు రేడియేషన్ అంకలోజిస్ట్ మణిదీప్ పెద్ది తెలిపారు. ఎం ఆర్ ఐ సాంకేతికతను లీనియర్ యాక్సిలరేటర్ (లైనాక్ )తో అనుసంధానం చేసిన ఎం ఆర్ లైనాక్ ద్వారా చికిత్స సమయంలో కణితిని స్పష్టంగా గుర్తించి, రేడియేషన్‌ను మరింత కచ్చితంగా అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రైవేట్ హాల్ లో డాక్టర్ అంకలోజిస్ట్ మణిదీప్ పెద్ది మాట్లాడుతూ క్యాన్సర్ చికిత్సలో కణితిపై అవసరమైన మోతాదులో రేడియేషన్‌ను అందించడంతో పాటు చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణజాలాన్ని రక్షించడం ఎంతో ముఖ్యమని వివరించారు. సాధారణ రేడియేషన్ చికిత్సలో చికిత్సకు ముందు తీసుకున్న ఇమేజింగ్ ఆధారంగా రేడియేషన్ ప్రణాళిక రూపొందిస్తారని, అయితే చికిత్స సమయంలో కణితి లేదా అవయవాల స్థితిలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఎం ఆర్ లైనాక్




లో ఎం ఆర్ ఐ స్కాన్ ద్వారా చికిత్స సమయంలోనే కణితి స్థానం, పరిమాణం తదితర వివరాలను పరిశీలించవచ్చని చెప్పారు. దీనివల్ల అవసరానికి అనుగుణంగా చికిత్స ప్రణాళికలో మార్పులు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా శరీర కదలికలు, శ్వాస కారణంగా స్థానం మారే కణితులకు ఈ సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.పలు రకాల క్యాన్సర్లకు ఉపయోగకరం(ప్రోస్టేట్, రెక్టల్, సర్వికల్, యుటెరస్, బ్లాడర్, లంగ్, ప్యాంక్రియాస్ తదితర క్యాన్సర్ల చికిత్సలో ఎం ఆర్ లైనాక్ సాంకేతికత ఉపయోగపడుతుందని తెలిపారు. కీలకమైన అవయవాలకు సమీపంలో ఉన్న కణితులకు రేడియేషన్ అందించే సమయంలో ఆరోగ్యకరమైన కణజాలాన్ని సాధ్యమైనంత వరకు కాపాడేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.చికిత్సను రోగి పరిస్థితికి అనుగుణంగా మార్చే అవకాశంఎం ఆర్ లైనాక్ ద్వారా చికిత్స సమయంలో కణితి స్థితిని పరిశీలిస్తూ అవసరమైన మార్పులు చేసుకునే అవకాశం ఉండటం దీని ప్రత్యేకతగా పేర్కొన్నారు. రోగి శరీర నిర్మాణం, కణితి స్థానం, చికిత్సకు సంబంధించిన మార్పులను పరిగణనలోకి తీసుకుని రేడియేషన్ అందించే విధానాన్ని సర్దుబాటు చేయవచ్చని తెలిపారు.క్యాన్సర్ చికిత్సలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎం ఆర్ లైనాక్ రేడియేషన్ ఆంకాలజీలో మరో కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

# భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 28(మన విశ్వం):** స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని బెల్లంపల్లిలోని సింగరేణి గని కార్మిక సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగం, చూపిన ధైర్యం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని అన్నారు. చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసి యువతలో జాతీయ స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు.భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టి. మణిరామ్ సింగ్, సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అంబాల మహేందర్, సింగరేణి గని కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎం. పోషమల్లు, శ్రామిక శక్తి గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి గజ్జె దుర్గయ్య, టీడీపీ బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షులు తైదల మధునాయక్, రేగుంట రాజుకుమార్ తదితరులు పాల్గొని భగత్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# చైర్‌పర్సన్ కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల సవాల్

**బెల్లంపల్లి సెప్టెంబర్ 28(మన విశ్వం):**
మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి చేసిన ఆరోపణలకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కౌంటర్ ఇచ్చారు. బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు సల్ల కృష్ణవేణి, తాండ్ర స్రవంతి మాట్లాడారు.కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ.. తనపై రూ.10 లక్షలు తిన్నానంటూ చైర్‌పర్సన్ దావ స్వాతి ఆరోపణలు చేశారని, ఆ ఆరోపణలను నిరూపిస్తే తాను కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఆరోపణలను నిరూపించలేకపోతే చైర్‌పర్సన్ పదవికి దావ స్వాతి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని సవాల్ విసిరారు. తన వార్డుకు సంబంధించిన ఆర్పీ విషయంలో కావాలనే తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కృష్ణవేణి ఆరోపించారు. ఆర్పీని తొలగించేందుకు చైర్‌పర్సన్ లెటర్ ప్యాడ్‌పై రాసి ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారని, దీనికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. తనపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని,




అవసరమైతే పరువునష్టం దావా వేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.అనంతరం కౌన్సిలర్ తాండ్ర స్రవంతి మాట్లాడుతూ.. నిన్నటి విలేకరుల సమావేశంలో చైర్‌పర్సన్ తమను 'జస్ట్ కౌన్సిలర్స్'గా సంబోధించడం బాధాకరమన్నారు. చైర్‌పర్సన్ కూడా 7వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికై, ఇతర కౌన్సిలర్ల మద్దతుతోనే చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారని గుర్తు చేశారు.బీఆర్ఎస్ పార్టీలోకి కౌన్సిలర్లను తీసుకోబోమని చైర్‌పర్సన్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. తమ పార్టీ నాయకత్వం ఆదేశాల మేరకు సామాన్య కార్యకర్తలు, ప్రజలు, పేదలు, ధనికులు అనే తేడా లేకుండా అందరినీ బీఆర్ఎస్‌లోకి ఆహ్వాని స్తున్నామని స్రవంతి తెలిపారు.అలాగే రూ.10 లక్షల వ్యవహారం లో ఇద్దరు కౌన్సిలర్లు చెరో రూ.5 లక్షలు తీసుకున్నారనే ఆరోపణలను కూడా ఆమె ప్రస్తావించారు. ఆ ఆరోపణలను నిరూపిస్తే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని, నిరూపించలేకపోతే చైర్‌పర్సన్ పదవికి దావ స్వాతి రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు.బెల్లంపల్లి పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, కార్యకర్తలు ప్రజల తరపున నిలబడతారని స్రవంతి స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఫారం--18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోండి
- నవంబర్ 6 వరకు అవకాశం
- టీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి ఎత్తారి మారయ్య పిలుపు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 28(మన విశ్వం):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎత్తారి మారయ్య పిలుపునిచ్చారు.
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 28 నుంచి ప్రారంభమైందని, నవంబర్ 6 వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఫారం--18 ద్వారా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత ఉన్నప్పటికీ నమోదు చేసుకోకపోతే ఓటు వేసే అవకాశాన్ని కోల్పోతారని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులంతా గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని మారయ్య కోరారు. "మీ ఓటు--మీ హక్కు. మీ నమోదు--ప్రజాస్వామ్య బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.

# మతోన్మాదానికి,సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్


**ములుగు, సెప్టెంబర్ 28(మన విశ్వం):** భరతమాత ముద్దుబిడ్డ బ్రిటిష్ సామ్రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి స్వాతంత్ర ఉద్యమాన్ని ఉగ్రరూతలూగించిన పోరాటయోధుడు దేశ స్వతంత్రం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా వదిలి ఉరి కొయ్యాలతో ఉయ్యాలలుగిన విప్లవ కిషోరం సర్దార్ భగత్‌సింగ్ 119వ జయంతి మరియు జాషువా 131వ జయంతి ని పురస్కరించుకుని కె వి పి ఎస్ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించి రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ కేవలం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదని, దోపిడీ, వివక్షత అసమానతలు లేని సమాజం కోసం ఆలోచించిన విప్లవకారుడని అన్నారు.శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత వంటి వారి ఆశయాలను కొనసాగించాలని గుర్తు చేశారు. ఈ సమాజం లో సామాజిక అసమానతలు రూపుమపాలని జాషువా ఆయన కవిత్వలు రచనల ద్వారా సమాజంలో మార్పు కోసం పని చేశారు.కులం, మతం పేరుతో యువతను విభజించే రాజకీయాలకు బదులుగా యువత ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి అసమానతలు లెనటువంటి వాస్తవ సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని ప్రవీణ్ అన్నారు. భగత్‌సింగ్ జాషువా స్ఫూర్తితో యువత ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుని,సామాజిక వివక్షత ను ప్రశ్నించాలని తమ హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమించాలని యువకులు నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి తప్ప ప్రభుత్వంతో భాగస్వామ్యం కావద్దని పిలుపునిచ్చారు.యువత




డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యాప్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి రక్త దానం చేసి ప్రాణాలు కాపాడి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. యువతలో సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తిని పెంపొందించడమే రక్తదాన శిబిరం లక్ష్యమని తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి రక్త దానం తో అండగా నిలిచేందుకు యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం కులమతాలకతీతంగా ప్రాణం కాపాడుతుంది తప్ప మనుషులని కులం మతం పేరుతో విడదీయదని గుర్తు చేశారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అవసరం పడుతుంది అన్నారు.భగత్‌సింగ్ జాషువా లను కేవలం జయంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండ వారి ఆశయాలను నేటి తరం యువత ముందుకు తీసుకెళ్లాలని, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి కోసం యువత చైతన్యంతో ప్రశ్నించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కె వి పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జన్ను దేవేందర్ కె జీ కె ఎస్ జిల్లా అధ్యక్షులు రవిగౌడ్ ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి నాయకులు రాకేష్ చంటి రమేష్,చెంద్రయ్య , నాగరాజు ,శివకుమార్,రాజ్ కుమార్, అరవింద్,అశోక్,నాయకులు, నగేష్,అతీష్,దేవరాజ్, శ్రీనివాస్,సురేష్,శ్రీహరి,రాజు. 30 మంది పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే హరీష్ బాబు

**సికిల్ సెల్ చికిత్సకు రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ అందజేత**



**కొమురం భీం, సెప్టెంబర్ 28(మన విశ్వం):** బెజ్జూర్ మండలం కుకుడా గ్రామానికి చెందిన దుర్గం సమ్మయ్యకు సికిల్ సెల్ వ్యాధి చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.25 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అందజేశారు.
బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యం అందించేందుకు ఈ ఆర్థిక సహాయం దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అవసరమైన వైద్య చికిత్స పొందాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, , కార్యకర్తలు పాల్గొన్నారు.

# వదంతులను నమ్మవద్దు

- విద్యార్థుల్లో ఎలుకలు కరిచిన ఆనవాళ్లు లేవు: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పాలకుర్తి గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- పరిశుభ్రత, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

**జనగామ, సెప్టెంబర్ 28 (మన విశ్వం):**
పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థులను పరిశీలించిన అనంతరం ఎలుకలు కరిచిన ఆనవాళ్లు కనిపించలేదని, వదంతులను నమ్మవద్దని స్పష్టం చేశారు.ఆర్డీఓ కిరణ్ ప్రకాష్‌తో కలిసి పాఠశాలను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థుల చేతులు, కాళ్లను పరిశీలించి గాయాలు, గీతలు ఉన్నాయా అని ఆరా తీశారు. జ్వరం, రక్తస్రావం వంటి సమస్యలేమీ లేవని, తాము ఆరోగ్యంగానే



ఉన్నామని విద్యార్థులు తెలిపారు. భోజనం కూడా బాగానే ఉందని పేర్కొన్నారు.అనంతరం కలెక్టర్ భోజనశాల, వంటశాల, సరుకుల నిల్వ గది, మరుగుదొడ్లు, వసతి గదులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. పనికిరాని వస్తువులను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు తాజా కూరగాయలతో పౌష్టికాహారం అందించాలని, ఆహార నాణ్యత విషయ ంలో రాజీ పడొద్దని సూచించారు.అనుమతి లేకుండా బయటి వ్య క్తులను పాఠశాల ప్రాంగణంలోకి రానివ్వకూడదని, ఎంపీడీఓలు, తహసీల్దార్లు గురుకులాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయా లని ఆదేశించారు. తనిఖీలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేదవతి, వైస్ ప్రిన్సిపల్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా పారదర్శకతకు కాంగ్రెస్ డిమాండ్

**ఆసిఫాబాద్‌లో భారీ నిరసన.. పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్**



**కొమురం భీం, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** సెప్టెంబర్ 28: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అనిల్ మర్మట్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల్ల మంగ, సిద్ధాల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) ప్రక్రియపై పారదర్శకత, జవాబుదారీతనం కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆసిఫాబాద్‌లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

# నిర్మల్ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల భారీ ధర్నా: వేతనాలు రూ.18,500కి పెంచాలని డిమాండ్

**ముధోల్(నిర్మల్),సెప్టెంబర్ 28(మన విశ్వం):**
తమ సుదీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని మరియు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా ధర్నా నిర్వహించారు. గ్రామాల పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

**ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి**
జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించిన విధంగా ప్రతి గ్రామపంచాయతీ కార్మిక వర్గానికి నెలకు కనీస వేతనం రూ. 18,500లకు పెంచి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత కాలంలో,ఇప్పుడు ఇస్తున్న అరకొర జీతాలతో కుటుంబాలను పోషించడం అత్యంత భారంగా మారిందని ఆవేదన



వ్యక్తం చేశారు.స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం!తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అంగీకరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని,అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మెకు దిగుతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన వందలాది మంది పంచాయతీ కార్మికులు, సానిటేషన్ సిబ్బంది, మల్టీపర్పస్ వర్కర్లు మరియు కార్మిక సంఘాల ముఖ్య నేతలు పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

# విద్యార్థుల భద్రతలో నిర్లక్ష్యం వద్దు

**- గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి**

**- ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు ఘటనలకు అడ్డుకట్ట**

**- దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫారాలు**

**- కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు**



**ములుగు, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురుకులాలు, వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఆహారం, పారిశుధ్యం, తాగునీరు, హాజరు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వంటశాలల్లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు--పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వెచ్చని నీరు, దుప్పట్లు ముందుగానే సమకూర్చాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందించాలని సూచించారు. అనంతరం ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. గురుకులాలు, వసతి గృహాలు, కేజీబీవీల్లో విస్తృత తనిఖీలు చేపట్టి ఆహారం, తాగునీరు, పారిశుధ్యం, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని స్పష్టం చేశారు.

# మాజీ సర్పంచ్ బుచ్చిరామ్‌కు బీఆర్ఎస్ నేతల పరామర్శ



**కొమురం భీం/ పెంచికల్‌పేట్ , సెప్టెంబర్ 28(మన విశ్వం):** అనారోగ్యంతో బాధపడుతున్న కమ్మర్‌గాం మాజీ సర్పంచ్ పోర్తేటి బుచ్చిరామ్‌ను సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఆయన నివాసంలో పరామర్శించారు. బుచ్చిరామ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నేతలు, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో మొర్లిగూడ సర్పంచ్ పోర్తేటి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు చౌదరి తిరుపతి, సయ్యద్ సాజీత్, వెంకటి, సత్తుపతి మారయ్య, చౌదరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు వినియోగించాలి

**- హార్ట్ ఎటాక్, రోడ్డు ప్రమాదాల్లో ఆలస్యం చేయొద్దు**

**- బాధితుడి వివరాలు, సంఘటనా స్థలాన్ని స్పష్టంగా తెలియజేయాలి**

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 28 (మన విశ్వం ):**
అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ బి.తిరుపతి, ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్ సూచించారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.హార్ట్ ఎటాక్, రోడ్డు ప్రమాదాలు తదితర అత్యవసర



పరిస్థితుల్లో 108కు ఫోన్ చేసి బాధితుడి పరిస్థితి, ప్రమాదం జరిగిన ప్రదేశం, ఖచ్చితమైన చిరునామా తదితర వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరారు. వివరాలను స్పష్టంగా చెప్పడం ద్వారా అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి త్వరగా చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఛాతీలో నొప్పి, గుండెపోటు లక్షణాలు కనిపించినప్పుడు, అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో సమయం వృథా చేయకుండా వెంటనే 108కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బి.తిరుపతి, జనార్ధన్ కోరారు.

# తొలి జీతంతో హనుమాన్ మందిరానికి రూ.21 వేల విరాళం



**ముధోల్ (తానూరు)సెప్టెంబర్ 28(మన విశ్వం):** మండలంలోని బొంద్రట్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గణేష్ పాటిల్ తన దేశభక్తితో పాటు ఆధ్యాత్మిక భక్తిని చాటుకున్నారు. తనకు వచ్చిన మొదటి ఆర్మీ జీతం నుంచి రూ. 21 వేల నగదును గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ మందిర నిర్మాణానికి విరాళంగా అందజేశారు. సోమవారం తన తాతయ్య అవధూత పాటిల్ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు.తాను సంపాదించిన మొదటి జీతాన్ని ఇలా దైవకార్యానికి, సామాజిక సేవా కార్యక్రమానికి కేటాయించిన జవాన్ గణేష్ పాటిల్‌ను గ్రామ సర్పంచ్ రవీంద్ర పాటిల్ సిందే,వార్డు సభ్యుడు భోజారం పటేల్, నాగేందర్ పటేల్ మరియు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభానికి మూడేళ్లు ఎందుకు?

**- పేదల ఉచిత వైద్యంపై నిర్లక్ష్యం తగదు**

**- 90 శాతం పనులు పూర్తయినా జాప్యమెందుకు?**

**- ప్రభుత్వ వైద్యాన్ని మరింత అందుబాటులోకి తేవాలి**

**బీఆర్ఎస్ నేత దొగ్గంపూడి రంజిత్‌రెడ్డి**



**వరంగల్, సెప్టెంబర్ 28 (మన విశ్వం):** వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో జరుగుతున్న జాప్యంపై బీఆర్ఎస్ నేత దొగ్గంపూడి రంజిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యాధునిక వైద్యం అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన ఆసుపత్రిని త్వరగా ప్రారంభించాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వ హయాంలోనే ఆసుపత్రి నిర్మాణ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్న ఆయన.. మిగిలిన పనులను పూర్తి చేయడంలో ఇంత జాప్యం ఎందుకని ప్రశ్నించారు. "పది శాతం పనులు పూర్తి చేయడానికి మూడేళ్లు పడుతుందా? ప్రజల ప్రాణాలకు సంబంధించిన వైద్య సదుపాయాల విషయంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు?" అని నిలదీశారు.ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తే పేదలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల ప్రారంభోత్సవాలకు చూపుతున్న ప్రాధాన్యతను ప్రభుత్వ ఆసుపత్రులను త్వరగా అందుబాటులోకి తీసుకురావడంపైనా చూపాలని కోరారు.ఎంజీఎం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందాల్సిన వైద్యానికి ఆరోగ్యశ్రీ, ఆధార్ వంటి పత్రాల అవసరం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. పేదలకు అందే వైద్య సేవల్లో పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ వైద్యం మరింత సులభంగా అందుబాటులోకి రావాలని డిమాండ్ చేశారు.వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువవుతాయని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. "ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ఆసుపత్రి ప్రజలకు ఉపయోగపడాలి. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి" అని డిమాండ్ చేశారు.

## జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయుడికి - ఘన సన్మానం




**పరిగి, సెప్టెంబర్ :** వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూరు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శ్రీ నీరటి నరసింహులు గారికి జిల్లా స్థాయిలో 'ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు' వరించింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు శ్రీ బుద్ధదేవ్ గారి అధ్యక్షతన, ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది సంయుక్తంగా ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ సన్మాన కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు శ్రీ బుద్ధదేవ్ గారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ఈ అవార్డు లభించడం ద్వారా ఉపాధ్యాయునిగా మీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన బోధన అందిస్తూ, మరింత బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల ప్రగతిని పెంపొందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్నాపూర్ శ్రీనివాస్, మధుసూదన్ రావు, కృష్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## యువతలో ప్రశ్నించే తత్వమే భగత్ సింగ్‌కు నిజమైన నివాళి..

**- సీపీఎం నేత ఎం. వెంకటయ్య**



**పరిగి, సెప్టెంబర్ 29 ) :** భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని పరిగి పట్టణంలో సీపీఎం పరిగి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య మాట్లాడుతూ, భగత్ సింగ్ కేవలం దేశ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమసమాజం కోసం పోరాడిన గొప్ప విప్లవ యోధుడు అని కొనియాడారు. యువతలో శాస్త్రీయ ఆలోచన, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. దేశంలో పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, అలాగే ఉపాధి, విద్య, వైద్యం మరియు భూమి హక్కుల సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని స్పష్టం చేశారు. భగత్ సింగ్ కలలు కన్న దోపిడీ, వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని, ఆయన త్యాగాలు ఎప్పటికీ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పరిగి ఏరియా కమిటీ నాయకులు ఎండీ హబీబ్, హెచ్. సత్యయ్య, రఘురాం, సీహెచ్ సత్యయ్య, మొగులయ్య, మోహన్, నర్సిములు, వెంకటయ్య, యాదగిరి, చీమ్న పాల్గొన్నారు.

## బీసీ కాలనీ యూత్ సొంతం చేసుకున్న గణనాధుని లడ్డు..



**దోమ, సెప్టెంబర్ 29 :** వికారాబాద్ జిల్లా దోమ మండలం శివారెడ్డిపల్లి గ్రామంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా నిర్వహించిన గణనాధుని లడ్డు వేలంపాటలో బీసీ కాలనీ యూత్ అందరూ కలిసి ఐకమ్యంతో రూ. 73,000 వేలం పాట పాడి లడ్డును దక్కించుకున్నారు. ?గత రెండేళ్లుగా ఈ లడ్డును కాలనీకి చెందిన సత్యం దక్కించుకోగా... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా మా కాలనీకి చెందిన సత్యం అన్న లడ్డును దక్కించుకుంటూ వస్తున్నారు. కానీ ఈసారి మా బీసీ కాలనీ యూత్ అంతా కలిసి ఒకే తాటిపై నిలవాలని నిర్ణ యించుకున్నాం. మా అందరి ఐక్యతకు ప్రతీకగా ఈ లడ్డును రూ. 73,000 కు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. గణనాధుని ఆశీస్సులు ఎల్లప్పు డూ మా కాలనీ ప్రజలందరిపై ఉండాలని మనసారా కోరుకుంటున్నాం. భవిష్యత్తులోనూ మా కాలనీ అభివృద్ధి కోసం, ఇలాంటి వేడుకల కోసం యూత్ అంతా ఇలాగే ఐక్యంగా ముందుంటాం." అని యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ బీసీ కాలనీ యూత్, కాలనీ వాసులతో పాటు గ్రామ ప్రజలు, గ్రామ నాయకులు గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కానుకల లెక్కింపు:భోసి గణపతి హుండీ ఆదాయం రూ.1.75 లక్షలు



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 28(మన విశ్వం):** నిర్మల్ జిల్లా తానూర్ మండలం భోసి గ్రామంలో వెలిసిన వరసిద్ధి వినాయక ఆలయ హుండీ కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్థుల సమక్షంలో హుండీని తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో ఆలయానికి రూ. 1,75,905 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు స్వామివారికి పెద్దఎత్తున కానుకలను సమర్పించారని తెలిపారు. ఈ హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనుల కోసం వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు,భక్తులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా బీజేపీ బీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అదోల్ల హన్మంట్లు నియామకం




**ముధోల్ (భైంసా),సెప్టెంబర్ 28(మన విశ్వం):** భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నిర్మల్ జిల్లా బీసీ మోర్చా కార్యవర్గంలో కీలక నియామకం జరిగింది. జిల్లా బీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అదోల్ల హన్మంట్లు నియమితులయ్యారు. రాష్ట్ర కార్యవర్గం ఈ నియామక ఉత్తర్వులను జారీ చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు మరియు జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ల ఆధ్వర్యంలోఈ నియామకం జరిగింది. పార్టీ బలోపేతానికి,బీసీ సామాజిక వర్గాల సంక్షేమానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అధిష్టానం ఈ బాధ్యతలను అప్పగించింది.

### ఎమ్మెల్యే సమక్షంలో ఘన సన్మానం

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన అదోల్ల హన్మండ్లు ను గౌరవముథోల్ శాసనసభ్యులు రామారావ్ పటేల్ సమక్షంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా మహిషా నగర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, కౌన్సిల్ మెంబర్లు, స్థానిక గల్లీ పెద్దలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు హన్మండ్లు ను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. తన నియామకంపై అదోల్ల హన్మంట్లు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన జిల్లా,రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడుస్తూ,నిర్మల్ జిల్లాలో బీసీ మోర్చాను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. హన్మంట్లు నియామకం పట్ల పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు

## ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నిరసన



**బెల్లంపల్లి,సెప్టెంబర్ 28**
(మన విశ్వం): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకట్ స్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దిష్టిబొమ్మను దహనం చేసి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అవకతవకలను వెంటనే పరిశీలించి, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని నాయకులు కోరారు.
ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బెల్లంపల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గేల్లీ రాజలింగు, దామెర శ్రీనివాస్, ఎల్తూరి శంకర్, ఖలీల్, గుజ్జ రవి, దెబ్బటి రమేష్, కాసర్ల యాదగిరి, ఎలుక ఆకాష్, శంకర్, అంకం రవి, పోతు మురళీమోహన్ పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

**బెజ్జూరు ఎస్సై విజయ్**



**బెజ్జూరు, సెప్టెంబర్ 28(మన విశ్వం):** యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని బెజ్జూరు ఎస్సై విజ య్ సూచించారు. సోమవారం మండలంలోని లంబాడిగూడ చౌరస్తాలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుడుంబా, పేకాట వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. యువత చెడు వ్యసనాల బారిన పడకుండా లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై విజయ్ పిలుపునిచ్చారు.

## భగత్ సింగ్ ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి:ముధోల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్




**ముధోల్, సెప్టెంబర్ 28(మన విశ్వం):** ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలోఅధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా దేశం ఆయనను 'షహీద్ భగత్ సింగ్'గా గౌరవిస్తోందని విద్యార్థులకు వివరించారు. నేటి యువత ఆయన దేశభక్తిని, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం



**ముధోల్ (నిర్మల్ అర్బన్),సెప్టెంబర్ 28(మన విశ్వం):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించవద్దని నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేశ్ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. బాధితుల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా,అధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా భూ సమస్యలు,సంక్షేమ పథకాలు,రేషన్ కార్డులు, మరియు ఇతర స్థానిక సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా ఇబ్బందులను నివారించాలని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు

## ఈసీ కమిషనర్ జ్ఞానేశ్వర్ వెంటనే వైదొలగాలి: ఎమ్మెల్యే బొజ్జ పటేల్ ఆగ్రహం

**-- నిర్మల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉధృత నిరసనలు**

**-- ఎన్నికల అధికారి దిష్టిబొమ్మ దహనం.. కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పణ**



**ముధోల్ (నిర్మల్ అర్బన్), సెప్టెంబర్ 28,(మన విశ్వం):** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కమిషనర్ జ్ఞానేశ్వర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షులు,స్థానిక ఎమ్మెల్యే బొజ్జ పటేల్ డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లోపించిందని,ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఈసీ వైఫల్యం చెందిందని ఆయన మండిపడ్డారు.
నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆర్డీవో కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఈసీ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో నినాదాలు చేశారు. అనంతరం ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మను రోడ్డుపై దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం ఎమ్మెల్యే బొజ్జ పటేల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్లింది. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని,బాధ్యుడైన కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం (మెమోరాండం) సమర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ శ్రీహరిరావు,మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేలా ఈసీ నిర్ణయాలు ఉండటం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నవంబరు 1 నాటికి డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు పూర్తయిన పట్టభద్రులు ఓటర్లుగా నమోదుకు అవకాశం ఉంది.



**హైదరాబాద్** :వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల సంఘం అధికారులు నేడు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ ఏడాది నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్ల కాలం పూర్తయిన పట్టభద్రులు మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇందుకుగానూ ఓటరు వివరాలతో కూడిన ఫారం-18 నింపాల్సిన ప్రక్రియ ఉంటుంది. నవంబర్ 6వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కూడా అప్లికేషన్డీఈవోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోల ఆఫీస్?ల వద్ద ఫారం-18 పత్రాలను అందుబాటులో ఉంచనున్నారు. పోస్టు ద్వారా కూడా ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు అప్లికేషన్లను పంపించవచ్చు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా కూడా అప్లికేషన్ ఫారాన్ని సమర్పించే వెసులుబాటు ఉంది.వరంగల్-ఖమ్మం-నల్గొండ, మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గడువు 2027 మార్చితో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న ఓటర్ల జాబితా షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు విడుదల చేశారు. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదుకు రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఎమ్మెల్సీ స్థానాలను ప్రధాన పార్టీలు కీలకమైన సవాలుగా తీసుకు ంటున్నాయి.ఆన్‌లైన్‌వైపే మొగ్గుఇ ప్పటికే ఓటర్ల నమోదుకు చేపట్టాల్సిన వ్యూహాలపై ప్రధాన పార్టీలు ఎక్కువగానే దృష్టి సారించాయి. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసే విధంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని గ్రామాల వారీగా డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన వారిని పార్టీల నాయకులు గుర్తిస్తున్నారు. మండల కేంద్రాల్లో ప్రత్యేక ల్యాప్‌టాప్‌లతో శిబిరాలను ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో వారి పేర్లను నమోదు చేసేలా ముమ్మర సన్నాహాలు చేస్తున్నారు.ఈఆర్వో, డీఈవో కార్యాలయాల్లో అప్లికేషన్ పత్రాలుమరోవైపు ఉపాధ్యాయ సంఘాలు కూడా టీచర్లను గుర్తించి ఆన్‌లైన్‌లో ఓటు కోసం నమోదు చేయించే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. చాలా మంది పట్టభద్రులు ఆన్‌లైన్ ద్వారా ఓటరు నమోదు వైపు మొగ్గు చూపుతారనే అంచనా వేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఫారం-18 నింపిన తర్వాత ప్రింట్ తీసి స్థానిక ఎన్నికల అధికారులకు ఆ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. మరోవైపు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వారికి ఈఆర్వో, డీఈవో కార్యాలయాల్లో అప్లికేషన్ పత్రాలను అందుబాటులో ఉంచుతామని ఎన్నికల నమోదు అధికారులు పేర్కొంటున్నారు.రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణఅయితే ఇంతవరకు ఈ పత్రాలు జిల్లాలకే చేరకపోవడం గమనార్హం. ఈ పత్రాలు ఎన్నికల అధికారుల కార్యాలయాలకు చేరడానికి రెండు, మూడు రోజులు పట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుతం రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న వారికి నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఎన్నికల అధికారులు ఓటర్ల నమోదుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని పట్టభద్రులు భావిస్తున్నారు.

## బిల్లులు ఇస్తారా ఇవ్వరా.. డిప్యూటీ సీఎం భట్టి ఛాంబర్ ముందు కాంట్రాక్టర్ల ఆందోళన.



**హైదరాబాద్** :కాంగ్రెస్ సర్కార్ పాలనలో ఉద్యోగుల తోపాటు కాంట్రాక్టర్లకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళన చేపడుతున్న సంఘటనలు చూస్తూనే ఉన్నాం. సెక్రటేరియట్ ముందు కూడా ఇప్పటికే ఉద్యోగులంతా నిరసన కూడా వ్యక్తం చేశారు. తాజాగా కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు మరోసారి ఆందోళన బాట పట్టారు.సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఛాంబర్ ముందు మరోసారి కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన నిర్వహించారు. తాము ఎన్నిసార్లు కాళ్లరిగేనా తిరిగినా భట్టి విక్రమార్క కలవడం లేదని.. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు వాపోయారు. బిల్లులు ఇస్తారా ఇవ్వరా.. తమకు భట్టితో అపాయింట్‌మెంట్ ఇప్పించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని రిటైర్డ్ ఉద్యోగులు భీష్మించుకుని కూర్చోవడంతో పోలీసులు వారించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.2024 ఆగస్టు 3న చనిపోయారు. ఈ రోజు వరకు రూపాయి కూడా రాకపోతే కుటుంబం ఎట్లా బతకాలి. ప్రభుత్వ ఉద్యోగం చేసుకునేది ఎందుకు సార్. ఎట్లా బతకాలి సార్ అంటూ రిటైర్ ఉద్యోగి కుటుంబ సభ్యుడొకరు ఆందోళన వ్యక్తం చేశాడు.

## కరెంట్ సమస్యపై ఆగ్రహం.. విద్యుత్ ఉద్యోగిపై కర్రతో దాడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 28:** నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఉద్యోగిపై వినియోగదారుడి దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. సరూర్‌నగర్ పోచమ్మబాగుకు చెందిన శివ ఇంట్లో కరెంట్ నిలిచిపోయింది. కరెంట్ సమస్యపై సంబంధిత విద్యుత్ అధికారులకు అతడు ఫిర్యాదు చేశారు. అయితే ఇతర పనుల్లో విద్యుత్ అధికారులు ఉండటంతో సరఫరా పునరుద్ధరణలో ఆలస్యమైంది. పలుమార్లు ఫోన్ చేసినా సమస్య పరిష్కరించలేదంటూ శివ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. నేరుగా సరూర్‌నగర్ విద్యుత్ ఏఈ కార్యాలయానికి చేరుకున్నారు.కరెంట్ సమస్యపై కార్యాలయంలో ఆపరేటర్‌తో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న వెంటనే ఏఈతో పాటు విద్యుత్ ఉద్యోగి రాజిరెడ్డి కార్యాలయానికి చేరుకున్నారు. సమస్య ఏంటని రాజిరెడ్డి ప్రశ్నించడంతో శివ మరింత ఆగ్రహానికి గురయ్యాడు. విద్యుత్ ఉద్యోగిని తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు అక్కడే ఉన్న కర్ర తీసుకుని దాడి చేశాడు. ఈ దాడిలో రాజిరెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సరూర్‌నగర్ పోలీసులకు విద్యుత్ ఉద్యోగి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 'దిశ' ఘటన జరిగిన చోట మరో దారుణం - ప్రయాణికురాలిపై లైంగిక దాడికి యత్నించిన క్యాబ్ డ్రైవర్



**హైదరాబాద్** :హైదరాబాద్ నగర శివారులో దారుణ ఘటన చోటుచేసుకుంది. శంషాబాద్ సమీపంలోని దిశ ఘటన జరిగిన ప్రదేశంలో ఓ మహిళపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నించడం కలకలం రేపింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళితే,నల్గొండ జిల్లా దేవరకొండలోని శివాజీనగర్‌కు చెందిన ఓ మహిళ ఈ నెల 26వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఓ క్యాబ్?లో జడ్చర్ల నుంచి హైదరాబాద్?కు బయల్దేరింది. హైదరాబాద్ సమీపంలోని తుండుపల్లి వద్ద అంటే 2019లో దిశ ఘటన జరిగిన ప్రదేశంలోని టోల్ ప్లాజా వద్ద డ్రైవర్ ఉన్నట్టుండి ఒకేసారి కార్ రూట్ మార్చాడురూ. 60 వేల నగదుతో పాటు ఓ బ్యాగుతో పరార్‌కొత్వాల్‌గూడ సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన క్యాబ్? డ్రైవర్, పథకం ప్రకారం ఆ మహిళపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాధితురాలు ప్రతిఘటించింది. తీవ్ర భయాందోళనకు గురై క్యాబ్ నుంచి కిందకు దిగి గట్టిగా కేకలు వేసింది. దీంతో భయాందోళనకు గురైన క్యాబ్? డ్రైవర్? అక్కడి నుంచి కారు తీసుకుని వేగంగా పరార్? అయ్యాడు. బాధితురాలి బ్యాగులో రూ.60 వేలు ఉండగా, ఆ బ్యాగ్? కారులోనే ఉండిపోయింది. ఈ ఘటనపై బాధితురాలు శంషాబాద్ రాజీవ్ గాంధీ ఎయిర్?పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీ, ఇతరత్రా ఆధారాలు నిందితుడిని చూస్తే గుర్తు పట్టగలనని బాధిత మహిళ పోలీసులతో చెప్పింది. దీంతో పోలీసులు టోల్‌గేట్ వద్ద సీసీటీవీ ఫుటేజీలు, ఇతరత్రా ఆధారాలను సేకరిస్తున్నారు. తన బ్యాగులో రూ.60 వేలు ఉన్నాయని, ఎలాగైనా తన డబ్బులు తనకు ఇప్పించాలని పోలీసులను కోరింది. నిందితుడికి శిక్ష వేసి తనకు న్యాయం చేయాలని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'దిశ' కేసు2019 నవంబర్ 27న రాత్రి 9 గంటల సమయంలో దిశ దారుణ హత్యకు గురైంది. సాయంత్రం శంషాబాద్?లో తన ఇంటి నుంచి బయల్దేరి తొండుపల్లి బాహ్యవలయ రహదారి వద్దకు చేరుకున్న దిశ, తన ద్విచక్ర వాహనాన్ని రహదారి పక్కనే నిలిపి చికిత్స కోసం క్యాబ్?లో గచ్చిబౌలికి వెళ్లింది. అనంతరం రాత్రి 9 గంటలకు తిరిగి క్యాబ్?లో తొండుపల్లి గేట్ వద్దకు చేరుకుంది. దిశ వెళ్లే సమయంలోనే గమనించిన నిందితులు ప్రణాళిక ప్రకారం ఆమె ద్విచక్ర వాహనం వెనక టైరులో గాలి తీసేశారు. ద్విచక్ర వాహనం వద్దకు చేరుకున్న దిశ గాలి లేని విషయాన్ని గమనించి అక్కడే ఆగిపోయింది.పథకం ప్రకారమేనలుగురు నిందితుల్లో ఓ యువకుడు అక్కడికి చేరుకొని టైరులో గాలి నింపుకొని వస్తానని అక్కడి నుంచి బయల్దేరాడు. చాలా సేపటికి కానీ అతడు రాలేదు. ఆలోపు మిగతా ముగ్గురు దిశను బలవంతంగా జాతీయ రహదారి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేశారు. బలవంతంగా నోట్లో మద్యం కూడా పోశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన దిశ ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి లారీలో చటాన్?పల్లికి తీసుకెళ్లారు. వంతెన కింద మృతదేహాన్ని కాల్చివేశారు. 28వ తేదీ తెల్లవారుజామున అటు నుంచి వెళ్తున్న వ్యక్తి కాలిపోతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా, విషయం వెలుగులోకి వచ్చింది

# సీఎం ఇలాకాలో బుల్డోజర్ల విధ్వంసం.. కొడంగల్‌లో 84 ఇళ్లు, దుకాణాలు కూల్చివేత



**కొడంగల్:** సీఎం రేవంత్ రెడ్డి ఇలాకా కొడంగల్‌లో బుల్డోజర్లు విధ్వంసం సృష్టిస్తున్నాయి. రోడ్ల విస్తరణ పేరుతో ఇల్లు, దుకాణాలను కూల్చివేస్తున్నారు. ఒక్క రూపాయి పరిహారం కూడా ఇవ్వకుండా పోలీసు బందోబస్తు మధ్య బుల్డోజర్లతో ఇండ్లను కూల్చివేస్తున్నారు. పైసా పైసా కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లు, దుకాణాలు కళ్లముందే కూలిపోవడంతో అనేక కుటుంబాలు నిలువ నీడ లేక రోడ్డునపడు తున్నాయి.రోడ్డు విస్తరణ కోసం తమ ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఎలాంటి పరిహారం ఇవ్వకుండా బుల్డోజర్లతో ఇళ్లు కూల్చివేయడంపై బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయిపరిహారం, ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. దీంతో కూల్చివేతల ప్రాంతంలో భారీగా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పహారా మధ్య బుల్డోజర్లతో కూల్చివేతలు కొనసాగుతున్నాయి.చిన్న మండల కేంద్రంలో అంత పెద్ద రోడ్డు విస్తరణ ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణ అంత అవసరమైతే బైపాస్ రహదారి ఏర్పాటు చేస్తే సరిపోయేదని అంటున్నారు. ఉన్న రోడ్లను సరిగా అభివృద్ధి చేయలేని ప్రభుత్వం.. కొత్త రోడ్డు పేరుతో సీఎం నియోజకవర్గంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన సొమ్ముతో నిర్మించుకున్న ఆశల సౌధాలు కళ్లముందే కూలిపోతుండటంతో బాధిత కుటుంబా లు తీవ్ర ఆవేదనకు గురవుతున్నాయి. ఇళ్లు, దుకాణాలు కోల్పోయిన కుటుంబా లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుం డా కూల్చివేతలు చేపట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పేదల ఇళ్లకు పరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయ ంగా ప్లాట్లు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాధితులకు పరిహారం, ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ఆందోళనకు శ్రీకారం చుడతామని ఆయన ప్రకటించారు. దీంతో కొడంగల్ నియోజకవర్గంలో కూల్చివేతల వ్యవహారం ఉద్రిక్తతకు దారితీస్తోంది

# బహదూర్‌గూడ రైతుల కథ ది ప్యారడైజ్ సినిమా లాంటిదే



**బహదూర్‌గూడ** రైతులు భూమి మాది.. మేం దున్నుకుంటున్నం.. అని చాలా రోజుల నుంచి హక్కుల కోసం పోరాటం చేస్తున్నరని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతులతో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు.ఈ సమావేశంలో పాల్గొన్నపట్లోళ్ల కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..నిన్న ది ప్యారడైజ్ సినిమా చూశామా..? ఆ సినిమాకు మా బహదూర్ గూడకు తేడా లేకుండా పోయింది. సినిమాలో వాళ్లమే మా హక్కులు మాకియ్యండి.. మా గుర్తింపు ఇయ్యండని కొట్లాడుతరు. మా భూమి కోసం మా భూమి మాదని గుర్తించడని కొట్లాడుతున్నం... బుల్లెట్ ట్రైన్ కోసం ఏ 40-50 ఎకరాలో అవసరముంటది.. 1000 ఎకరాలు పడ్తదా..? సరే రోజూ పండ్లు, పూలు, గులాబీ తోటల్లో పని చేస్తున్న మా రైతుల భూముల మీద కన్నుపడ్డది. మరి పక్కన కేఎల్ఆర్ భూమి ఉన్నది.. అక్కడ కన్ను పడ్తలేదు.. ఎందుకో..? ఆ ల్యాండ్ మన బహదూర్‌గూడలో లేదా..? ఖూ= భూమి నుండి బుల్లెట్ ట్రైన్ పోదా.. మన దాంట్లో నుండే పోతుందా బుల్లెట్ ట్రైన్ అని ప్రశ్నించారు. మనదే కనిపిస్తదా..? పేదోళ్ల పొట్ట కొట్టాలే.. పెద్దోళ్లను మాత్రం కాపాడాలే అని ఫైర్ అయ్యారు. హైడ్రా అదే పని చేస్తున్నదని మండిపడ్డారు.ఇవాళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి బుల్లెట్ ట్రైన్ అంటున్నడు.. మేం అభివృద్ధికి వ్యతిరేకం కాదు.. బరాబర్ బుల్లెట్ ట్రైన్ కావాలి.. మన నియోజకవర్గంలో మెట్రో రైలు తీసుకొచ్చిందెవరు కేసీఆర్ కాదా.. అని ప్రశ్నించారు. దీన్ని మనం వ్యతిరేకిస్తలేం.. ఎంత అవసరమో గంతే తీసుకోండి అంటున్నం. .

## ఈడీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆందోళన




**హైదరాబాద్ :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి () నివాసం, కార్యాలయాలతో పాటు సంబంధిత ప్రాంతాల్లో 2024 సెప్టెంబర్ 27, 28 తేదీల్లో ఈడీ ( నిర్వహించిన సోదాలు, అనంతరం కొనసాగిన దర్యాప్తు వివరాలను వెల్లడించాలని బీఆర్ఎస్ నాయకులుడిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్‌వై ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, నవీన్ రెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద్ గౌడ్, సంజయ్, పార్టీ సీనియర్ నాయకులు తలసాని సాయి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు ఆందోళన నిర్వహించారు.ఈడీ కార్యాలయంలోకి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు తొలుత అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు ఈడీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయగా, అనంతరం అధికారులను కలిసి లేఖ అందించేందుకు పోలీసులు అనుమతించారు.

# తెలంగాణలో స్థానికత అంశం - మరోసారి స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు



**హైదరాబాద్** :తెలంగాణ స్థానికత విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత ఇచ్చింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిందేనని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ బెంచ్ ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తెలంగాణ స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న పిటిషనర్? వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్ష(నీట్)కు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదువుకుంటేనే స్థానికత వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను మరోసారి అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది.అసలు కథ మొదలైంది ఇక్కడ : వైద్య విద్యలో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు స్వరాష్ట్రం తెలంగాణలో చదివి ఉండాలని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులను జారీ చేసింది. అప్పుడే కొంతమంది విద్యార్థులు ఈ అంశంపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్? దాఖలు చేయగా, నిబంధనలను తప్పుబడుతూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.దీనిపై తెలంగాణ ప్రభుత్వం నేరుగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటిషన్? దాఖలు చేసింది. ఈ కేసు విచారణను చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌ల ధర్మాసనం అన్ని అంశాలను పరిగణించి కొద్ది రోజుల పాటు తీర్పును రిజర్వ్ చేసింది. ఆగస్టు 05న వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు తెలిపిన న్యాయస్థానం, ఇంకేమైనా వాదనలుంటే ఆగస్టు 8లోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఇరు వర్గాలను ఆదేశించింది.ప్రభుత్వంపై సీజేఐ ఆగ్రహం : స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని జస్టిస్ గవాయ్ విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించారు. విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు ధర్మాసనంతో చెప్పారు.

# ఆసియా క్రీడలు.. తొమ్మిదో రోజు భారత్‌కు మరో రెండు పతకాలు



ఆసియా క్రీడల్లో తొమ్మిదో రోజు భారత్‌కు మరో రెండు పతకాలు వచ్చాయి. షూటింగ్‌లో రజతం, కురాష్‌లో కాంస్య పతకలదదక్కాయి. ఇక బాక్సింగ్‌లో స్టార్ బాక్సర్ లవ్లీనా పతకం ఖాయం చేసుకుంద. ప్రస్తుతం భారత్ 39 పతకాలతో 12వ స్థానంలో ఉంది. ఇందులో నాలుగు స్వర్ణాలు, 17 రజతాలు, 18 కాంస్యాలు ఉన్నాయి. షూటింగ్ వ్యక్తిగత విభాగంలో భారత్ షూటర్ సింగ్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. 25 మీటర్ల వ్యక్తిగత విభాగంలో చైనాకు చెందిన జియో జియోరుక్సాస్‌తో గోల్డ్ కోసం ఇషా పోటీ పడింది. చివరివరకూ ఇద్దరి స్కోర్ సమంగా ఉండటంతో షూట్ ఆఫ్ నిర్వహించారు. ఇందులో చైనా గెలిచి స్వర్ణం గెలుచుకుంది. దీంతో ఇషా సింగ్‌కు రజతం సొంతమైంది.

# బంతి పడలేదు.. టీమిండియా సెమీస్‌కు చేరింది



వర్షం కొట్టేసింది.. సెమీస్‌కు టీమిండియా హైదరాబాద్: ఆసియా క్రీడలలలో వర్షం కారణంగా భారత్--అఫ్గానిస్థాన్ మధ్య జరగాల్సిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. బెస్ట్ ర్యాంకింగ్ ప్రకారం టీమిండియా నేరుగా సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆసియా క్రీడల నాకౌట్ మ్యాచ్‌ల నిబంధనల ప్రకారం వర్షం లేదా ఇతర కారణాలతో మ్యాచ్ రద్దయితే, ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా మెరుగైన జట్టు సెమీస్ కు చేరుతుంది. ప్రస్తుతం భారత్ ప్రపంచ నంబర్-1 టీ20 జట్టుగా ఉండగా, అఫ్గానిస్థాన్ 10వ స్థానంలో ఉంది. దీంతో ఫలితం లేకుండానే భారత్ తదుపరి దశకు వెళ్లింది.హాంగ్‌జౌలోనూ ఇదే నిబంధన 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లోనూ భారత్‌కు ఇదే నిబంధన కలిసొచ్చింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఫైనల్ వర్షం కారణంగా రద్దవడంతో ర్యాంకింగ్ ప్రకారం భారత్ స్వర్ణ పతకాన్ని సాధించింది. అఫ్గాన్‌పై అజేయంగా భారత్ టీ20 క్రికెట్‌లో అఫ్గానిస్థాన్‌పై భారత్ ఇప్పటివరకు ఓటమి చవిచూడలేదు. ఇరు జట్ల మధ్య జరిగిన 13 మ్యాచ్‌ల్లో టీమిండియా 11 విజయాలు సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు ఫలితం లేకుండా ముగిశాయి. ఈ రెండు కూడా ఆసియా క్రీడల్లోనే జరిగాయి.=పాక్ కూడా సెమీస్‌లోకి మరో క్వార్టర్‌ఫైనల్లో పాకిస్థాన్--హాంకాంగ్ చైనా మ్యాచ్ కూడా భారీ వర్షం కారణంగా రద్దయింది. మెరుగైన సీడింగ్ ఆధారంగా పాకిస్థాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ బుధవారం జరిగే సెమీఫైనల్లో బంగ్లాదేశ్--మలేషియా మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరో సెమీఫైనల్లో పాకిస్థాన్.. శ్రీలంక--నేపాల్ మ్యాచ్ విజేతతో ఆడనుంది. దీంతో ఆసియా క్రీడల ఫైనల్లో మరోసారి భారత్--పాకిస్థాన్ క్రికెట్ పోరు జరిగే అవకాశం ఉంది. భారత మహిళల క్రికెట్ జట్టు ఇప్పటికే ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది.

# పోలికలు వద్దు.. సచిన్ పాజీకి ప్రత్యేక స్థానం ఉంది: కోహ్లీ



తిరువనంతపురం: సచిన్ తనకు ఎప్పటికీ సచిన్ పాజీనే అని రన్ మిషన్ విరాట్ కోహ్లీ తెలిపాడు. సచిన్ ఆడే సమయంలో క్రికెట్ లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని, అది గణాంకాలు, పోలికలకు మించిన విషయమని ప్రశంసించారు. అలాగే ఎంఎస్ ధోనీ తన తొలి కెప్టెన్‌గా ఎప్పటికీ ప్రత్యేకమేనని కోహ్లీ వివరించాడు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన అనంతరం సచిన్ టెండూల్కర్‌తో తనను పోల్చడంపై విరాట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ విషయాలు తన మనసులో ఎప్పటికీ నిలిచిపోతాయని, తాను సాధించాల్సిందంతా సాధించేశానని, ఒక స్థాయికి చేరుకున్నానని ఎప్పుడూ భావించలేదన్నాడు.ఇక చాలు తాను సాధించేశాను అనే భావన తనలో ఎప్పుడ లేదన్నారు. ఇతరుల కంటే తానే గొప్ప అనే భావన ఉండకూడదని, అహంకారానికి చోటివ్వకూడదని తెలియజేశారు. కష్టపడి, వినయంగా ఉంటూ, సరైన రీతిలో సన్నద్ధమై, క్రీడలో సరైన పనులు చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. తాను అందరికంటే గొప్పవాడినని విర్రవీగినచో అప్పుడే ప్రయాణం ముగిసినట్లేనని అని కోహ్లీ చెప్పాడు. అభిమానులు చూసే కోహ్లీ వేరు, తనని తాను చూసుకునే విరాట్ వేరు అని తెలిపారు. అభిమానులు తన ఆటను, ప్రదర్శనలను దూరం నుంచి చూసి ఒక ప్రత్యేకమైన ప్రతిరూపాన్ని ఏర్పరుచుకున్నాడన్నారు. తన ప్రదర్శనలు, దేశం కోసం తాను ఆడిన క్రికెట్ ద్వారా మాత్రమే అభిమానులకు తెలుసునని, కానీ తాను ఎక్కడి నుంచి వచ్చానో తనకు తెలుసనని, మనం ఎప్పటికీ మన అసలు వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదన్నారు. ఇతరులు తనని చూసే కోణంలో తనని తాను అసలు చూసుకోనని కోహ్లీ పేర్కొన్నాడు.వెస్టిండీతో జరిగని మ్యాచ్ లో విరాట్ కోహ్లీ 88 బంతుల్లో 10 ఫోర్లు, 9 సిక్సర్లతో 139 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్‌తో కోహ్లీ మరో అరుదైన రికార్డు జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ను అధిగమించాడు. రన్‌ఛేజ్‌లో అత్యధిక విజయాల్లో భాగమైన ఆటగాళ్ల జాబితో కోహ్లీ మూడో స్థానంలో ఉన్నాడు. భారత్ రన్‌ఛేజ్ చేస్తూ గెలిచిన వన్డేల్లో కోహ్లీ ఇప్పటివరకు 112 విజయాల్లో జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రికీ పాంటింగ్ తన జట్టు తరఫున రన్‌ఛేజ్ విజయాల్లో 111 సార్లు భాగమయ్యాడు. దీంతో కోహ్లీ అతడిని అధిగమించి ఈ జాబితాలో మూడో స్థానానికి చేరుకున్నాడు. ఈ జాబితాలో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ 127 విజయాలతో అగ్రస్థానంలో ఉన్నాడు. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 116 విజయాల తో రెండో స్థానంలో ఉన్నాడు. తరువాత వరసగా రికీ పాంటింగ్(111), రోహిత్ శర్మ, జక్వాస్ కలిస్(110) ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 శతకాల సచిన్ టెండూల్కర్ రికార్డును అధిగమిం చాలనే చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ప్రస్తు తం కోహ్లీ ఖాతాలో 86 సెంచరీలతో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో మరో అరుదైన ఘనత కూడా కోహ్లీ ఖాతాలో చేరింది. భారత్‌లో జరిగిన వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్‌ను కోహ్లీ అధిగమించాడు. సచిన్ భారత్‌లో 164 వన్డేల్లో 6,976 పరుగులు చేశాడు. ఆ రికార్డును అధిగమించేందుకు కోహ్లీకి మరో 110 పరుగులు అవసరం కాగా, వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఆ లక్ష్యాన్ని దాటేశాడు.




## కోహ్లీ అరుదైన మైలురాయి

వెస్టిండీస్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మరో చారిత్రాత్మక మైలురాయిని అందుకున్నాడు. ఈ మ్యాచ్ లో మెరుపు సెంచరీ చెలరేగిన కోహ్లీ.. వన్డేల్లో 15,000 పరుగుల మార్క్‌ను దాటిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ మైలురాయిని 303 ఇన్నింగ్స్‌లలోనే చేరుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 15,000 వన్డే పరుగులు పూర్తి చేయడానికి 377 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. దీంతో 15,000 వన్డే పరుగుల మార్క్‌ను అత్యంత వేగంగా అందుకున్న బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు సాధించాడు. కాగా, ఈ మ్యాచ్ లో విండీస్ జట్టుపై 8 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించారు.

## ఆసియా క్రీడల్లో భారత్ పతక జోరు



నగోయా (జపాన్): ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారుల పతకాల వేట కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే భారత్ ఏడు పతకాలు సాధించింది. అథ్లెటిక్స్‌లో ఐదు, స్క్వాష్‌లో రెండు పతకాలు భారత్ ఖాతాలో చేరాయి. మరోవైపు బాక్సింగ్‌లో ముగ్గురు భారత బాక్సర్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోవడంతో పతకాలు ఖాయమయ్యాయి.ఆసియా క్రీడల్లో ఎనిమిదో రోజు ముగిసే సమయానికి భారత్ 4 స్వర్ణాలు, 16 రజతాలు, 17 కాంస్యాలతో మొత్తం 37 పతకాలు సాధించింది. పతకాల పట్టికలో భారత్ 12వ స్థానంలో కొనసాగుతోంది.స్క్వాష్‌లో రెండు రజతాలు:పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్, మహిళల సింగిల్స్‌లో అనహత్ సింగ్ రజత పతకాలు సాధించారు. ఆసియా క్రీడల్లో రజతం సాధించిన తొలి భారత మహిళా స్క్వాష్ క్రీడాకారిణిగా అనహత్ సింగ్ నిలిచింది.అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన భారత్:మహిళల లాంగ్‌జంప్‌లో ఆన్సీ సోజన్ రజతం, పురుషుల హైజంప్‌లో సర్వేశ్ కుమార్ రజతం సాధించారు. పారుల్ చౌదరి, తేజస్విన్ శంకర్, హరిత భద్ర కాంస్య పతకాలు దక్కించుకున్నారు.పతకాలు ఖాయం:అంకుశ్, పర్వీన్, నరేందర్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుని భారత్‌కు మరో మూడు పతకాలను ఖాయం చేశారు



## జావెలిన్‌లో డబుల్ ధమాకా.. శ్రీశంకర్‌కు రజతం

ఐచీ-నగోయా: 18వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాలతో మెరిశారు. పురుషుల లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ రజత పతకం సాధించగా, జావెలిన్ త్రోలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. యశ్వీర్ సింగ్ రజతం, రోహిత్ యాదవ్ కాంస్యం గెలుచుకున్నారు.లాంగ్‌జంప్ ఫైనల్లో మురళీ శ్రీశంకర్ 8.07 మీటర్లు దూకి రెండో స్థానంలో నిలిచాడు. పోటీలో గాయపడటంతో చివరి రెండు ప్రయత్నాలను చేయలేకపోయాడు. మరో భారత అథ్లెట్ డేవిడ్ సొలొమాన్ 7.70 మీటర్లతో ఏడో స్థానంలో నిలిచాడు.జావెలిన్ త్రోలో యశ్వీర్ సింగ్ 85.72 మీటర్లు విసిరి రజతం సాధించాడు. రోహిత్ యాదవ్ 84.68 మీటర్ల ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. శ్రీలంకకు చెందిన రుమేశ్ పతిరంగ 88.55 మీటర్లతో స్వర్ణం గెలిచాడు. బాక్సింగ్‌లో మరో మూడు పతకాలు ఖాయం బాక్సింగ్‌లో లొవ్లీనా బొర్గొహైన్, ప్రియా గంఘాస్, కపిల్ పొఖారి యా సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

## డబ్ల్యూపీఎల్2027కు రంగం సిద్ధం.. స్టార్ క్రికెటర్లను అట్టిపెట్టుకున్న ఫ్రాంచైజీలు



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 సీజన్‌కు సంబంధించి ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించాయి. ఐదు జట్లు తమకు కీలకంగా భావించిన ఆటగాళ్లను కొనసాగిస్తూ వచ్చే సీజన్‌కు జట్లను సిద్ధం చేసుకున్నాయి. దీంతో డబ్ల్యూపీఎల్2027లో మరోసారి స్టార్ క్రికెటర్ల మధ్య హోరాహోరీ పోరు జరగనుంది. వచ్చే సీజన్‌కు ముందు నిర్వహించనున్న వేలిపై కూడా క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.కీలక ఆటగాళ్లకు కొనసాగింపుడిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ ప్రధాన ఆటగాళ్లపై నమ్మకం కొనసాగించింది. కెప్టెన్ స్మృతి మంధానతో పాటు ఎలీసా పెర్రీ, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్ వంటి కీలక ఆటగాళ్లను జట్టులోనే ఉంచుకుంది. గత సీజన్‌లో జట్టు విజయానికి సహకరించిన ఆటగాళ్లను కొనసాగించడం ద్వారా అదే సమతూకాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేసింది.ముంబై ఇండియన్స్ కీలక బలగం అలాగే..ముంబై ఇండియన్స్ కూడా తమ స్టార్ ఆటగాళ్లను కొనసాగించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు హేలీ మాథ్యూస్, నాట్ సీవర్-బ్రంట్, అమేలియా కేర్, నికోలా క్యారీ, షబ్నం ఇస్మాయిల్ వంటి ఆటగాళ్లకు చోటు కల్పించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లను కొనసాగిస్తూ జట్టు నిర్మాణాన్ని బలంగా ఉంచింది.యూపీ వారియర్స్ కూడా కీలక ఆటగాళ్లను రిటైన్ చేసిందియూపీ వారియర్స్ తమ జట్టులోని ప్రధాన ఆటగాళ్లను కొనసాగించింది. దీప్తి శర్మ, మెగ్ లానింగ్, ఫోబీ లిచ్‌ఫీల్డ్, సోఫీ ఎకిల్‌స్టోన్ వంటి అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లపై ఫ్రాంచైజీ మరోసారి విశ్వాసం ఉంచింది. దేశీయ, విదేశీ ఆటగాళ్ల కలయికతో జట్టును మరింత పటిష్ఠం చేసుకునే దిశగా అడుగులు వేసింది.గుజరాత్ జెయింట్స్ నుంచి కూడా కొనసాగింపుగుజరాత్ జెయింట్స్ బెత్ మూనీ, యాష్లీ గార్డ్నర్, జార్జియా వేర్‌హామ్, సోఫీ డివైన్ తదితర కీలక ఆటగాళ్లను కొనసాగించింది. అనుభవం ఉన్న ఆటగాళ్లతో పాటు ఆల్‌రౌండర్లకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చే సీజన్‌కు జట్టును సిద్ధం చేస్తోంది.ఢిల్లీ క్యాపిటల్స్ కీలక ఆటగాళ్లకు అండ ఢిల్లీ క్యాపిటల్స్ కూడా తమ ప్రధాన ఆటగాళ్లను కొనసాగించింది. జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, లారా వోల్వార్ట్, మారిజాన్ కాప్ తదితరులకు రిటెన్షన్ జాబితాలో చోటు కల్పించింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ బలమైన ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడంతో వచ్చే సీజన్‌లో ఢిల్లీ జట్టుపై అంచనాలు కొనసాగుతున్నాయి.వేలిపై భారీ ఆసక్తి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను ప్రకటించడంతో ఇప్పుడు విడుదలైన ఆటగాళ్లు, వేలిలోకి రానున్న క్రికెటర్లపై దృష్టి నెలకొంది. అక్టోబర్ 28న కొచ్చిలో డబ్ల్యూపీఎల్ వేలం జరగనుంది. వచ్చే ఏడాది జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు డబ్ల్యూపీఎల్ సీజన్ నిర్వహించనున్నట్లు సమాచారం. వేలిలో ఫ్రాంచైజీలు తమకు అవసరమైన ఆటగాళ్లను దక్కించుకునేందుకు పోటీ పడనున్నాయి.



## గుల్వీర్ సింగ్ సూపర్ షో.. 1500 మీటర్లలోనూ రజత పతకం

నగోయా: ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ మరోసారి సత్తాచాటాడు. పురుషుల 1500 మీటర్ల పరుగులో రజత పతకం సాధించాడు. సోమవారం జరిగిన ఫైనల్లో గుల్వీర్ 3:36.72 నిమిషాల్లో రేసును పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శనతో గుల్వీర్ ఈ ఆసియా క్రీడల్లో తన రెండో రజత పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు.చివరి వరకు ఆధిపత్యం1500 మీటర్ల ఫైనల్లో గుల్వీర్ ఆరంభం నుంచే పోటీలో ముందంజలో నిలిచాడు. చివరి ల్యాప్‌లో వేగం పెంచుతూ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చాడు. ఫినిషింగ్ లైన్ సమీపించే వరకు గుల్వీర్ స్వర్ణం కోసం పోటీలోనే ఉన్నాడు. అయితే చివరి దశలో జపాన్‌కు చెందిన కజుటో ఇజావా అనూహ్యంగా పుంజుకుని గుల్వీర్‌ను అధిగమించాడు. కేవలం 0.37 సెకన్ల తేడాతో ఇజావా స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు.వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగుల్వీర్ 1500 మీటర్ల ఫైనల్లో నమోదు చేసిన 3:36.72 నిమిషాల సమయం అతని వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. రేసు మొత్తం వ్యూహాత్మకంగా సాగినప్పటికీ చివరి ల్యాప్‌లో గుల్వీర్ చూపిన వేగం ఆకట్టుకుంది. చివరి క్షణంలో స్వర్ణం చేజారినా రజతంతో మెరిశాడు.10 వేల మీటర్లలోనూ రజతంఇదే ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ ఇప్పటికే 10,000 మీటర్ల విభాగంలో రజత పతకం సాధించాడు. తాజాగా 1500 మీటర్లలోనూ రజతం గెలవడంతో ఒకే ఆసియా క్రీడల్లో రెండు రజత పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా నిలిచాడు.1500 మీటర్లలో జపాన్‌కు చెందిన కజుటో ఇజావా స్వర్ణం సాధించగా, గుల్వీర్ సింగ్ రజతం దక్కించుకున్నాడు. మరో జపాన్ అథ్లెట్ నగియా మోరీ 3:37.92 నిమిషాల టైమింగ్‌తో కాంస్య పతకం సాధించాడు.

## నెట్‌ఫ్లిక్స్‌లోకి మెగాస్టార్ చిరంజీవి.. పాడ్‌కాస్ట్‌తో సరికొత్త ప్రయాణం!



తెలుగు చిత్రసీమలో దాదాపు 48 ఏళ్లుగా అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు సరికొత్త బాటలో ప్రయాణించేందుకు సిద్ధమయ్యారు. వెండితెరపై తన మాస్ ఇమేజ్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై తనదైన ముద్ర వేయనున్నారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి ఆయన ఒక ప్రత్యేకమైన పాడ్‌కాస్ట్ సిరీస్ చేయబోతున్నారు. తొలుత చిరంజీవి జీవిత ప్రస్థానంపై ఒక డాక్యుమెంటరీని రూపొందించాలని భావించినప్పటికీ, పాడ్‌కాస్ట్ అయితే తన భావాలను మరింత స్వేచ్ఛగా, నేరుగా పంచుకోవడానికి వీలుంటుందని ఆయన భావించినట్లు తెలుస్తోంది. ఈ వినూత్న ఆలోచనను ఆయన కుమార్తె, నిర్మాత సుస్మిత కొణిదెలతో పాటు ప్రముఖ రచయిత బీవీఎస్ రవి ప్రతిపాదించగా, చిరంజీవి వెంటనే అంగీకరించినట్లు సమాచారం. ఇప్పటికే పలు విజయవంతమైన టాక్ షోలకు పనిచేసిన అనుభవం ఉన్న బీవీఎస్ రవి ఈ ప్రాజెక్టుకు రచన, రూపకల్పన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాధారణ ఇంటర్వ్యూలలో పంచుకోని ఎన్నో వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలు, స్టార్‌డమ్ వెనుక ఉన్న శ్రమ, సినీ ప్రస్థానంలోని ఎత్తుపల్లాలను ఈ పాడ్‌కాస్ట్ ద్వారా చిరంజీవి అభిమానులతో పంచుకోనున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే విడుదల చేయనుందని తెలుస్తోంది.

## మళ్ళీ అమ్మ సెంటిమెంట్ తో పూరి..

పూరీ జగన్నాథ్.. పేరు వింటేనే ఒక డిఫరెంట్ మేనరిజం, రా యాటిట్యూడ్ గుర్తొస్తాయి. ఆయన హీరోలు సమాజంతో గొడవ పడే విధానం చాలా కొత్తగా ఉంటుంది. కానీ ఈసారి పూరీ తన ట్రాక్ మార్చాడని తెలుస్తోంది. వరుస అప్డేట్స్ తో హీరో బిచ్చగాడిగా ఎలా మారాడు అనే కోణంలో క్యూరియాసిటి క్రియేట్ చేస్తున్నాడు. 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' అనే టైటిల్ తోనే తన మార్క్ చూపించాడు. ఇక లేటెస్ట్ గా మరో గ్లింప్స్ వదిలారు. ఇందులో హీరో యాటిట్యూడ్ కన్నా ఎక్కువగా, ఒక బలమైన మదర్ సెంటిమెంట్ చుట్టూ కథను తిప్పబోతున్నట్లు హింట్ ఇచ్చారు. పూరి సినిమాల్లో మదర్ సెంటిమెంట్ కూడా డిఫరెంట్ గానే ఉంటుంది. చిరుత, అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, లోఫర్, రోగ్, లైగర్.. ఇలా ఎక్కువ సినిమాల్లో అమ్మ ఎమోషన్ ను హైలెట్ చేశారు. ఇక ఈ సినిమాలో సీనియర్ నటి జరీనా వహాబ్ తల్లిగా 'జుబేదా' అనే పాత్రలో నటిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో ఆమె క్యారెక్టర్ ను పరిచయం చేసిన విధానం గుండెను మెలిపెట్టేలా ఉంది. ట్రైన్ కింద తలపెట్టి చనిపోదాం అనుకున్నా, ఆ ధైర్యం




సరిపోలేదని, ఆకలితో ప్రాణాలు పోతుంటే ఆఖరికి తన చేతులు అడుక్కోవడానికి ముందుకొచ్చాయని జుబేదా పాత్ర చెప్పే డైలాగ్స్ చాలా బరువైన ఎమోషన్‌ను క్యారీ చేస్తున్నాయి. దీని తర్వాత విజయ్ సేతుపతి ఎంట్రీ ఇవ్వడం చూస్తుంటే తల్లి కోసం ఏమైనా చేస్తాడా అనే క్యూరియాసిటి క్రియేట్ అయ్యింది. 'అమ్మ ఉన్నది అన్నం పెట్టడానికి, అడుక్కోవడానికి కాదు' అని పూరి వాయిస్ ఓవర్ హైలెట్ అయ్యింది. అంటే ఆకలి కోసం బిచ్చగత్తెగా మారిన ఒక తల్లి, ఆ తల్లి పడే బాధను చూడలేక రగిలిపోయే కొడుకు.. ఈ ఇద్దరి మధ్య పూరీ జగన్నాథ్ ఎలాంటి కథను రాశాడో అని ఆలోచిస్తే చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది. కచ్చితంగా ఈసారి పూరీ తన మార్క్ మాస్ ఎలిమెంట్స్‌కు ఒక గట్టి సెంటిమెంట్‌ను జోడించబోతున్నట్లు కనిపిస్తోంది. చివరగా ఇస్మార్ట్ శంకర్ లాంటి ఊర మాస్ సినిమాతో హిట్ కొట్టిన పూరీ, ఆ తర్వాత వరుస పరాజయాలతో ఇబ్బంది పడ్డాడు. కానీ ఈసారి ఆ తప్పులు జరగకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్లు ఈ గ్లింప్స్ క్వాలిటీ చూస్తే తెలుస్తోంది. ముఖ్యంగా పూరీ డైలాగ్స్‌లో ఉండే పదును ఈ వీడియోలోనూ తగ్గలేదు. ఛార్మి కౌర్, జేబీ మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాతో పూరీ మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకుంటాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరి ఈ ప్రయోగం ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. టబు కూడా ఇందులో ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు.

## టెక్నాలజీ, మన కథలు... ఇదే భారత సినిమా భవిష్యత్తు : నాగ్ అశ్విన్




భారీ బడ్జెట్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'తో జాతీయ స్థాయిలో మరోసారి సత్తా చాటిన దర్శకుడు నాగ్ అశ్విన్, భారత సినిమా భవిష్యత్తుపై తన ఆలోచనలను పంచుకున్నారు. మన దేశానికే ప్రత్యేకమైన కథలు, పురాణాలకు ఆధునిక టెక్నాలజీని జోడించడం ద్వారా భారత సినిమా సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల 'కల్కి' చిత్రానికి 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో భాగంగా ఉత్తమ ప్రజాదరణ పొందిన వినోదాత్మక చిత్రం, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో అవార్డులు లభించిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "మన కథలు, మన తత్వశాస్త్రానికి టెక్నాలజీని జోడించడం ద్వారా భారతీయ సినిమాకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. ఇది కచ్చితంగా నిజం" అని ఆయన స్పష్టం చేశారు. టెక్నాలజీ అందరికీ అందుబాటులోకి రావడం వల్ల మరింత మంది సృజనకారులు తమ ఆలోచనలను తెరపైకి తీసుకురాగలరని నాగ్ అశ్విన్ అన్నారు. "ఈ సాంకేతికత ఎంత సులభంగా అందుబాటులోకి వస్తే, అంత వైవిధ్యమైన, అసలైన గొంతుకలకు బలం చేకూరుతుంది. ఇది ఎక్కువ మంది తమ కథలను తమదైన రీతిలో చెప్పడానికి వీలు కల్పిస్తుంది" అని ఆయన వివరించారు. 'కల్కి 2898 ఏడీ' 2024లో విడుదలైన ఒక మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ చిత్రం. హిందూ పురాణాల స్ఫూర్తితో, 2898 నాటి కాశీ నగరంలో ఈ కథ నడుస్తుంది. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, శోభన వంటి భారీ తారాగణం ఇందులో నటించారు. శేఖర్ కమ్ముల వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన నాగ్ అశ్విన్, 2018లో నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తీసిన 'మహానటి' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే.


## సూర్యతో సినిమాపై నోరు విప్పిన రాజమౌళి



ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఖ్యాతిని చాటిన దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, విలక్షణ నటుడు సూర్య కాంబినేషన్‌లో సినిమా వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి కాంబోపై రాజమౌళి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. సూర్యతో సినిమా చేస్తే అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా (స్పెషల్) ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఆ విషయం గురించి మాట్లాడటానికి ఇది సరైన సమయం కాదని సున్నితంగా దాటవేశారు. ఇటీవల మలయాళ నటుడు ఫహాద్ ఫాసిల్ నటించిన 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' అనే సినిమా ప్రీ-రిలీజ్ వేడుకకు రాజమౌళి, సూర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నకు రాజమౌళి సమాధానమిచ్చారు. "మీరు ఈ ప్రశ్న అడుగుతారని ఊహించే ఇక్కడికి వచ్చాను. దానికి సమాధానం కూడా సిద్ధం చేసుకున్నాను. కానీ, మనం ఇక్కడికి వచ్చింది 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాను ప్రమోట్ చేయడానికి. ఇప్పుడు నేను, సూర్య సినిమా గురించి మాట్లాడితే, అదే హెడ్‌లైన్ అవుతుంది. అసలు సినిమా పక్కకు వెళ్లిపోతుంది. అది సరికాదు" అని అన్నారు. అదే సమయంలో అభిమానులకు భరోసా ఇస్తూ.. "మేమిద్దరం కలిసి ఎప్పుడు సినిమా చేసినా, అది కచ్చితంగా చాలా ప్రత్యేకంగా ఉంటుంది" అని చెప్పడంతో సూర్య అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. అంతటితో ఆగకుండా సూర్యను రాజమౌళి అభినందనలతో ముంచెత్తారు. ఇటీవల 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి చిత్రాలతో వరుస విజయాలు సాధించడం 'డబుల్ ధమాకా' అని ప్రశంసించారు. అలాగే, జీతూ మాధవన్ దర్శకత్వంలో సూర్య నటిస్తున్న 'సీన్' సినిమా ప్రచార చిత్రాలు కూడా అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు. గతంలో రాజమౌళి దర్శకత్వంలో నటించే ఒక అవకాశాన్ని తాను కోల్పోయానని, ఆయనతో కలిసి పనిచేయాలని ఉందని పలు ఇంటర్వ్యూలలో సూర్య స్వయంగా చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాజమౌళి వ్యాఖ్యలతో ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రావడం ఖాయమనే అంచనాలు మరింత బలపడ్డాయి.

## అది హనుమాన్ టెంపుల్ కాదు.. శిరీష్ ఫిర్యాదుపై పోలీసులు!





హీరో అల్లు శిరీష్ చేసిన డీజే సౌండ్ ఫిర్యాదుపై సైబరాబాద్ పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలతో ఇబ్బంది కలుగుతోందంటూ శిరీష్ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆ శబ్దాలకు హనుమాన్ ఆలయానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై అల్లు శిరీష్‌తో మాట్లాడినట్లు పోలీసులు వెల్లడించారు. సదరు శబ్దాలు గణేశ్ నిమజ్జనం ఊరేగింపు నుంచి వచ్చాయని, హనుమాన్ ఆలయం నుంచి కాదని వివరించారు. కార్యక్రమ నిర్వాహకులతో కూడా చర్చించామని, ఇప్పటికే నిమజ్జనం పూర్తయిందని వారు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం, తన నివాసం సమీపంలోని ఒక హనుమాన్ ఆలయం వద్ద అర్ధరాత్రి వరకు డీజే సౌండ్ పెట్టి ఇబ్బంది పెడుతున్నారంటూ అల్లు శిరీష్ సోషల్ మీడియా వేదికగా అసహనం వ్యక్తం చేశారు. ఈ పోస్ట్‌పై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు లోతుగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించారు. పోలీసుల తాజా వివరణతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.



## ఫౌజీ' బ్యూటీ సౌండింగ్ లేదే!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తోన్న -ఫౌజీ- సినిమాలో ఛాన్స్ అందుకుని ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది ఇమ్మాన్వీ ఇస్మైల్. డార్లింగ్ సరసన నటించాలని ఎంతో మంది ఫేమస్ బ్యూటీలో రేసులో ఉన్నా? వాళ్లందర్నీ పక్కనబెట్టి మరీ దర్శకుడు హను రాఘవపూడి ఇమ్మాన్విని ఎంపిక చేసారు. అందుకు తగ్గట్టే అమ్మడు మంచి ట్యాలెంటెడ్. డాన్సింగ్ స్కిల్స్ తో ఇప్పటికే లక్షల్లో ఫాలోవర్లను సంపాదించుకుంది. నటన పరంగా అమ్మడు ఎలాంటి పెర్ఫార్మర్ అన్నది ఫౌజీతో ప్రూవ్ అవ్వాలి. ఈ బ్యూటీ సినిమా ప్రారంభోత్సవ వేడుకలో మెరిసిన క్షణం నుంచి టాలీవుడ్ వ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. హను రాఘవపూడి కథానాయికలను వెండితెరపై ఎంత అందంగా, వైవిధ్యంగా చూపిస్తారో -సీతారామం-తో నిరూపితమవ్వడంతో ఇమ్మాన్వీ పై కూడా అంచనాలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. ఆమె పాత డ్యాన్స్ వీడియోలు, సోషల్ మీడియా రీల్స్ నెట్టింట విపరీతంగా ట్రెండ్ అయ్యాయి. టాలీవుడ్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చేసిందంటూ ట్రేడ్ వర్గాలు కూడా భావించాయి. అయితే ఆరంభంలో కనిపించిన ఆ హడావుడి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు.
-ఫౌజీ- అనౌన్స్‌మెంట్ తర్వాత ఇమ్మాన్వీ నుంచి ఎలాంటి పెద్ద చప్పుడు లేదు. కొత్తగా ఆమె వేరే ఏ తెలుగు ప్రాజెక్ట్‌కూ సైన్ చేసినట్లు ప్రచారం జరగకపోవడం.. అలాగే టాలీవుడ్ ఈవెంట్లలో గానీ, సర్కిల్స్‌లో గానీ అమ్మడి పేరు ఎక్కడా పెద్దగా వినిపించ కపోవడంతో ఫౌజీ బ్యూటీ లైనప్ స్తబ్దుగా మారిందనే చర్చ మొదలైంది..సాధారణంగా ప్రభాస్ లాంటి గ్లోబల్ స్టార్ సరసన అవకాశం వస్తే ఇతర నిర్మాతలు, దర్శకులు ఆ కథానాయికతో సినిమాలు చేసేందుకు క్యూ కడుతుంటారు. ఆ క్రేజ్‌ను వాడుకుని వరుసగా ప్రాజెక్ట్‌లు దక్కించుకోవడం ఇండస్ట్రీలో సహజంగా జరిగే ప్రక్రియ. కానీ ఇమ్మాన్వీ మాత్రం అందుకు భిన్నంగా సైలెంట్‌గా మొదటి సినిమాపైనే పూర్తి దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569